**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 104, పేజీలు - 08
బుధవారం,అక్టోబర్ 14, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఓట్ల కోతలు.. గల్లీలో నిశ్శబ్దం!

## - రికార్డు స్థాయి కోతలు జరుగుతున్నా రోడ్డెక్కని బాధితులు!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఊహించని రీతిలో రికార్డు స్థాయి ఓట్ల కోతకు దారితీస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఉన్న సుమారు 3.38 కోట్ల ఓటర్ల జాబితాలోంచి ఏకంగా 73.39 లక్షల ఓట్లను అంటే దాదాపు 21.7% పైగా తొలి విడత డ్రాఫ్ట్ రోల్‌లోనే తొలగించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరణించినవారు 9.22 లక్షలు, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు 45.18 లక్షలు, అడ్రస్‌లో లేనివారు 11.25 లక్షలు , రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు 6.70 లక్షలు అనే వర్గీకరణ కింద ఈ భారీ ఓట్ల తొలగింపు జరిగింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోనే దాదాపు 40 లక్షలకు పైగా ఓట్లు మాయమయ్యాయి.

**- వీరంతా ఎందుకు సైలెంట్ గా ఉంటున్నారు?**

ఇంత భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ప్రక్రియ సాగుతుంటే, ప్రజాస్వామ్యంలో రావాల్సిన స్థాయి ఆందోళన గానీ, ప్రజా ఉద్యమం గానీ క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిళ్లలో పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా ఓటర్ల జాబితాలో కొద్దిపాటి వ్యత్యాసాలు వచ్చినా వీధుల్లో ధర్నాలు చేసే రాజకీయ పార్టీలు, ఈ ఐదేళ్లలో ఐదో వంతు ఓట్లు 22% గాల్లో కలిసిపోతున్నా వీధి పోరాటాలకు ఎందుకు దిగడం లేదు? ఢిల్లీ స్థాయిలో ప్రతిపక్షాలు , జాతీయ నేతలు నిరసనలు, ప్రెస్ మీట్లు

2లో..



# ఇండీ కూటమి పిటిషన్లో 14 లోపాలు

## - సవరిస్తే విచారిస్తామన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎస్ఐఆర్ లో పెద్దఎత్తున ఓట్ల తొలగింపు సహా అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు 10 మంది ప్రతిపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రాలేదు. ఈ పిటిషన్‌లో సుప్రీం కోర్టు రిజిస్ట్రీ గుర్తించిన లోపాలను పిటిషనర్లు ఇంకా

2లో..

# వ్యాపారులకు పండగ ఊరట!

## - యూపీఐ ఛార్జీల అమలుపై కీలక నిర్ణయం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలపై ప్రతిపాదిత ఎండీఆర్ ఛార్జీల అమలును వాయిదా వేస్తున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది.

2లో..

# డబుల్ డెక్కర్ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్

## - కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ**
**- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం**
**- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై సానుకూల స్పందన**



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే లక్ష్యంతో ప్రతిపాదించిన ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైన మంత్రి కోమటిరెడ్డి, తెలంగాణలో చేపట్టాల్సిన పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు. ఈ భేటీలో కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి, హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్, రోప్‌వేలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు సహా అనేక ప్రతిపాదనలు ప్రస్తావనకు వచ్చాయి.

**- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్**

హైదరాబాద్ తూర్పు వైపు వేగంగా విస్తరిస్తున్న ప్రాంతాల్లో ఎల్బీనగర్, హయత్‌నగర్ చాలా ముఖ్యమైన ప్రాంతాలు. ఈ మార్గంలో వాహనాల రద్దీని తగ్గించేందుకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదన కీలకంగా మారింది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపినట్లు

2లో..

# సింగరేణి కార్మికులే ప్రథమ ప్రాధాన్యం

## - ఒక్కొక్కరికి రూ.1. 51 లక్షల దసరా బోనస్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సింగరేణి ఉద్యోగులకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుడ్‌న్యూస్ అందించారు. సంస్థ సాధించిన లాభాల్లో 34 శాతాన్ని సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లు ఆయన మంగళవారం ప్రకటించారు. ఒక్కో రెగ్యూలర్ కార్మికుడికి రూ. 1.51 లక్షల దసరా

2లో..

# సీఎం చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

## - తెలుగు గంగ నీటి విడుదల అంశంపై చర్చ

**- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించిన చంద్రబాబు**
**- నీటి లభ్యతను బట్టి సాయం చేస్తామని చంద్రబాబు హామీ**
**- ఇప్పటికే చెన్నైకి 4.08 టీఎంసీలు విడుదల చేశామని వెల్లడి**



అమరావతి (ప్రశ్న న్యూస్) విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అమరావతిలోని ఉండవల్లికి చేరుకున్నారు. సీఎం క్యాంప్ ఆఫీసుకు చేరుకున్న విజయ్‌కి ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ మధ్య కీలక భేటీ జరిగింది. ఈ భేటీ సందర్భంగా ఇరు రాష్ట్రాల సంక్షేమం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు ప్రధానంగా 'తెలుగు గంగ' నీటి విడుదల అంశంపై ముఖ్యమంత్రులు చర్చించారు. చెన్నై నగరానికి తాగునీటి అవసరాలను తీర్చడానికి తగినన్ని కృష్ణా జలాలను విడుదల చేయాలని చంద్రబాబును తమిళనాడు సీఎం విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఏడాది ఇప్పటికే ఏపీ ప్రభుత్వం నుంచి చెన్నైకి 4.08 టీఎంసీల నీటిని అందించిన విషయాన్ని చర్చల్లో ప్రస్తావించారు.

**- తెలుగుగంగ తాగునీటి విడుదలపై సమగ్ర చర్చలు**

ఈ ఏడాది తెలుగుగంగ ద్వారా ఇప్పటికే 4.08 టీఎంసీల నీటిని ఏపీ ప్రభుత్వం తమిళనాడుకు అందించింది. అయితే, చెన్నై అవసరాల రీత్యా ఈ కోటాను మరింత పెంచాలని తమిళనాడు ప్రభుత్వం కోరుతోంది. దీనిపై స్పందించిన ఏపీ ప్రభుత్వం మానవీయ కోణంలో తాగునీటి అవసరాలకు నీరందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. అయితే వర్షపాతం, నీటి నిల్వలు, వాతావరణ పరిస్థితుల ఆధారంగా సాధ్యాసాధ్యాలను పరిశీలించి నీటిని విడుదల చేస్తామని

2లో..

# దేవీనవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను

## - విజయవాడ ఉత్సవ్‌లో తమిళనాడు సీఎం విజయ్



విజయవాడ (ప్రశ్న న్యూస్) కృష్ణమ్మ పరవళ్లు తొక్కే పున్నమి ఘాట్ వేదికగా జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలకు మంగళవారం ప్రత్యేక కళ సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉత్సవాలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కళాకారుల ప్రతిభతో పున్నమి ఘాట్ సందడిగా మారింది. ముఖ్యమంత్రులు ఇద్దరూ ఒకే వేదికపైకి రావడంతో అభిమానులు, ప్రజల్లో ఉత్సాహం నెలకొంది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు విజయవాడ ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆయన ప్రసంగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూశారు.

**- తెలుగులో ప్రసంగించిన తమిళనాడు సీఎం విజయ్**

అందరికీ నమస్కారం అంటూ తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించిన తమిళనాడు

2లో..

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

**- గీజర్‌లో దాచి తరలిస్తున్న 7.750 కిలోల గంజాయి సీజ్**
**- పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 2.71 కోట్లు అని అంచనా**
**- బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడిని అరెస్ట్ చేసిన డీఆర్‌ఐ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పోలీసులు, అధికారులు ఎన్ని కఠిన చర్యలు తీసుకున్నా తెలంగాణలోకి గంజాయి, డ్రగ్స్ ను రాకుండా మాత్రం అడ్డుకోలేక పోతున్నారు. ఇతర దేశాల నుంచి అనేక రూపాల్లో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నాయి కొన్ని ముఠాలు.

2లో..

# విదేశీ శక్తులతో కలిసి కమ్యూనిస్టుల కుట్ర

## - వారి ధర్నాల వల్లే ఢిల్లీ మార్కెట్లు దెబ్బతిన్నాయని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశంలో అరాచకం సృష్టించేందుకు కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు విదేశీ శక్తులతో కలిసి కుట్ర పన్నుతున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీలో నిరసనల పేరుతో ఈ పార్టీలు ఉద్దేశపూర్వకంగా దేశ ఆర్థిక వ్యవస్థను, శాంతిభద్రతలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి కమ్యూనిస్టుల పాత్రపై ప్రత్యేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంగ్రెస్, కమ్యూనిస్టులు చేస్తున్న ధర్నాల వల్ల ఢిల్లీ మార్కెట్ పూర్తిగా దెబ్బతింది. దసరా, దీపావళి వంటి పండుగ సీజన్‌లో చిన్న దుకాణదారులు సరుకులు తెచ్చుకోలేని దుస్థితిని కల్పించారు. కుట్రపూరితంగా ఢిల్లీ ప్రజల జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తూ వ్యాపారుల పొట్ట కొడుతున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తన స్థాయిని మరిచి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కులను దుర్వినియోగం చేస్తూ దేశ ప్రతిష్టను మంటగలుపుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షా, అజిత్ దోవల్‌ను లక్ష్యంగా చేసుకుని బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తమకు అనుకూలంగా తీర్పులు రాలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా గద్దె దిగమనడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రభుత్వంపై విమర్శలు చేయడంలో తప్పులేదని, కానీ రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

# మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

## - కేంద్రంపై ఉమ్మడి పోరాటమేనన్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని విపక్షాలు మంగళవారం స్పష్టం చేశాయి. న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు ఎలాంటి పాత్ర పోషించినా, పోషించకపోయినా తమ ప్రతిఘటన ఆగదని తేల్చిచెప్పాయి. నిరసనల వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని,

2లో..

# హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి

## - పాత విధానం తేకపోతే ఆందోళన చేపడతామన్న హరీశ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరకుల సరఫరా చేసే విధానంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

2లో..

## ఓట్ల కోతలు.. గల్లీలో నిశ్శబ్దం!

నిర్వహిస్తున్నప్పటికీ, ఆ వేడి తెలంగాణ గల్లీలకు ఎందుకు చేరడం లేదు.?

**- కాంగ్రెస్ రాజకీయ ఆందోళనలు**

ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిపై ప్రధానంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, సీఈవోకు వినతిపత్రాలు ఇవ్వడం, బోగస్ ఫారమ్-7 అప్లికేషన్లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించాలని పోలీసు అధికారులను కలవడానికే పన్ను పరిమితమైంది. నిజమైన ఓటర్లను ప్రజాసమీకరణ ద్వారా వీధుల్లోకి తెచ్చి చైతన్యవంతం చేయడంలో అధికార పార్టీ ఘోరంగా విఫలమైందనే అభిప్రాయం ఉంది. కేవలం హైదరాబాద్‌లోని ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషామహల్ లాంటి నియోజకవర్గాలకే తమ ఫిర్యాదులను పరిమితం చేస్తూ, సచివాలయం, గాంధీ భవన్ గదులకే కాంగ్రెస్ పోరాటం పరిమితమైందనే వ్యాఖ్యలు వినపడుతున్నాయి. తొలగించిన ఈ ఓటర్లు నిజంగా అర్హులైన ప్రతినిధులేనా అనే అనుమానం ఎక్కువగా ఉంది. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ఐటీ కారిడార్లలో నివసించే వారిలో అత్యధికులు ఏపీకి చెందిన డబుల్ ఓటర్లు, లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన ఐటీ, వలస కార్మికులు. ఈ ఓటర్లలో మెజారిటీ వర్గం ఎన్నికల రోజున కనీసం పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేసే ఆసక్తి చూపించకపోవడం, లేదా స్వగ్రామాలకు వెళ్లిపోతుండటంతో.. వారి ఓట్లు మాయమైనా సాధారణ ప్రజల్లోనూ, స్థానిక క్యాడర్‌లోనూ ఎలాంటి పట్టింపు కనిపించడం లేదు.

**- సరైన రీతిలో అవగాహన కల్పించలేకపోయారా?**

పక్కాగా దొంగ ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని భావిస్తున్న స్థానిక ప్రజలు, దీనిని తమ హక్కుల భంగంగా చూడటం లేదు. కేవలం బిఎల్ఓ అధికారులు ఇంటింటికీ రాకుండా ఫంక్షన్ హాళ్లలో కూర్చుని నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని వార్తలు వస్తున్నప్పటికీ, బాధితుడు స్వయంగా స్పందించి ఫారమ్-6 దాఖలు చేసుకునే స్థితిలో లేకపోవడమే ఈ నిశ్శబ్దానికి ప్రధాన కారణం. ఢిల్లీ రాజకీయాల్లో రాజ్యాంగ పరిరక్షణ, ఓట్ చోరీ నినాదాలు ప్రచార ఆయుధాలుగా మారినప్పటికీ, తెలంగాణ క్షేత్రస్థాయిలో ప్రజలు దీనిని ఒక రొటీన్ పరిపాలనా ప్రక్రియగా చూడటమే వ్యత్యాసానికి మూలం. 70 లక్షల ఓట్ల కోత అనేది చిన్న విషయం కాకపోయినప్పటికీ, ప్రజాస్వామ్య హక్కులపై గ్రాస్ రూట్ స్థాయిలో సరైన అవగాహన కల్పించడంలో రాజకీయ పార్టీలు, పౌర సమాజం విఫలమవడమే ఈ నిశ్శబ్దానికి సంకేతం.

## ఇండీ కూటమి పిటిషన్లో 14 లోపాలు

సవరించకపోవడమే కారణంగా తేలింది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఈ పిటిషన్‌లో రిజిస్ట్రీ మొత్తం 14 లోపాలను గుర్తించింది. కోర్టుకు చెల్లించాల్సిన రుసుములో 220 రూపాయలు తక్కువ పడటం కూడా వాటిలో ఒకటని తెలిపింది. మిగిలిన లోపాల్లో తొమ్మిది మంది పిటిషనర్ల అధికారిక అనుమతి పత్రాలు లేవని, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గుర్తింపు కార్డు నకలులో ఆయన ఫొటో ఐడీ స్పష్టంగా లేదని వివరించింది. పిటిషన్‌లో పొందుపరిచిన కొన్ని పత్రాలు చదవడానికి వీలులేకుండా ఉన్నాయని వివరించింది. పేజీల నంబరింగ్ క్రమంలో వ్యత్యాసాలు వంటి లోపాలున్నాయని, వాటిని సవరించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆదేశించింది.మంగళవారం ఈ వ్యవహారాన్ని ఒక జర్నలిస్ట్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రస్తావించగా, సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. లోపాలను సరిదిద్దినట్లయితే వారి అంశాలను విచారణ కోసం జాబితా చేస్తామని తెలిపింది. "మేము ఈ పిటిషన్లన్నింటినీ విచారణకు జాబితా చేస్తాము. అయితే ముందుగా అందులోని లోపాలన్నీ సవరించేలా చూసుకోండి." అని స్పష్టం చేసింది.కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఖర్గేతో పాటు టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటి) నేత సంజయ్ రౌత్, సిపిఐకు చెందిన డి. రాజా, ఝార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపీ మహువా మాఝీ, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ముస్లిం లీగ్ నేత ఇ.టి. మహమ్మద్ బషీర్ తదితరులు సహ పిటిషనర్లుగా ఉన్నారు. ఈ కేసులో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలను ప్రతివాదులుగా చేర్చారు.

ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ' (సర్) ప్రక్రియలో పెద్ద ఎత్తున ఓటర్ల పేర్ల తొలగింపులు, అక్రమాలు జరిగాయని ఈ పిటిషన్లో ఆరోపించారు. సర్ సమయంలో జరిగిన తొలగింపులు, మార్పులపై నిర్ణీత కాలపరిమితిలో స్వతంత్ర ఆడిట్ నిర్వహించేందుకు, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. చట్టప్రకారం తగిన నోటీసు, విచారణకు సహేతుకమైన అవకాశం లేకుండా ఏ ఓటరు పేరునూ జాబితా నుంచి తొలగించకుండా చూడాలని, అలాగే ఎన్నికలు జరగనున్న పంజాబ్, ఇతర రాష్ట్రాల్లో అర్హులైన వ్యక్తులు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చుకునేందుకు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కూడా ఇది కోరింది.ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల సంఘం వ్యవహారాలు, పలువురు విద్యార్థుల ఏకపక్ష అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు అవకాశం ఇవ్వాలని రాహుల్ గాంధీ, ఖర్గే కోరగా భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. అయితే, దీనిపై న్యాయపరంగా పిటిషన్ దాఖలు చేస్తే త్వరితగతిన విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. దీంతో ఇండీ కూటమి సుప్రీం కోర్టుకు భారీ ర్యాలీ చేపట్టి పిటిషన్ దాఖలు చేసింది.

## వ్యాపారులకు పండగ ఊరట!

పండగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో వ్యాపారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీంతో వ్యాపార వర్గాలకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది. ఈ విషయంపై మంగళవారం సమావేశమైన యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, ఈ నిర్ణయాన్ని ఖరారు చేసింది. "పండగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ఎంపిక చేసిన పర్సన్-టు-మర్చంట్ (పీ2ఎం) యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్)ను దీపావళి తర్వాత అమలు చేయాలని నిర్ణయించాం. కచ్చితమైన తేదీని త్వరలోనే ప్రకటిస్తాం" అని ఎన్‌పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. దీని ప్రకారం, ఛార్జీల అమలు నవంబర్ రెండో వారం తర్వాత ఉండే అవకాశం ఉంది.

**- ఏమిటీ ఛార్జీలు?.. ఎవరిపై భారం?**

గత సెప్టెంబర్‌లో యూపీఐ స్టీరింగ్ కమిటీ, రూ.2,000కు మించిన లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ విధించాలని నిర్ణయించింది. అంటే, వ్యాపారి ప్రతి రూ.2,000 లావాదేవీపై రూ.8, అలాగే రూ.10,000 లావాదేవీపై రూ.40 చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ ఛార్జీల భారం వినియోగదారులపై పడదని, కేవలం వ్యాపారులు మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎంత పెద్ద లావాదేవీ అయినా గరిష్ఠంగా రూ.300 మించి ఛార్జీ విధించరు. ఉదాహరణకు, రూ.75,000 అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు గరిష్ఠంగా రూ.300 మాత్రమే వసూలు చేస్తారు. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం, వ్యవసాయ ముడిసరుకులు వంటి కొన్ని కీలక రంగాల్లో రూ.2,000 దాటిన లావాదేవీలకు ఫ్లాట్‌గా రూ.5 ఛార్జీని ప్రతిపాదించారు. వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు (పీ2పీ), అలాగే రోజువారీ చిన్న వ్యాపార లావాదేవీలు యథాతథంగా ఉచితంగానే కొనసాగుతాయి. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, మోసాల నివారణ, కస్టమర్ సపోర్ట్ వంటి మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చేందుకే ఈ ఛార్జీలను ప్రతిపాదించినట్టు కేంద్రం వివరించింది.

## సింగరేణి కార్మికులే ప్రథమ ప్రాధాన్యం

బోనస్ లభిస్తుంది. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా రూ. 5,500 చొప్పున బోనస్ అందించనున్నట్లు తెలిపారు. ఈ బోనస్ నిర్ణయంతో వేలాది మంది కార్మిక కుటుంబాలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరనుంది.

**- గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు**

సింగరేణి లాభాలు తగ్గడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే ప్రధాన కారణమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ చేసినంత నష్టం సింగరేణికి మరే ప్రభుత్వం చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం 141 బొగ్గు బ్లాకులను వేలం వేసినప్పటికీ, కనీసం ఒక్క వేలంలో కూడా సింగరేణి పాల్గొనకుండా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో సింగరేణి కంటే తక్కువ ధరకే బొగ్గు అందుబాటులో ఉండటం వల్ల, సంస్థ మనుగడను కాపాడుకోవడానికి తప్పనిసరి పరిస్థితుల్లో బొగ్గు ధరలను తగ్గించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. 'నెహ్రూ కాలనీల' పేరుతో కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు క్వార్టర్ల నిర్మాణం, ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి మించి మోడ్రన్‌గా అత్యుత్తమ వైద్య సదుపాయాల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

**- ప్రజాభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటనలు**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంపై పలు విషయాలను వెల్లడించారు. సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల త్వరలోనే నెరవేరబోతోందని హామీ ఇచ్చారు. అలాగే మారుపేర్ల ద్వారా ఉద్యోగాలు చేస్తున్న కార్మికుల సమస్యల పట్ల తెలంగాణ ప్రభుత్వం ఎంతో సానుకూలంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రమాద బీమా కింద దేశంలో ఎక్కడాలేని విధంగా సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

## డబుల్ డెక్కర్ కారిడార్‌కు గ్రీన్ సిగ్నల్

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్ అందుబాటులోకి వస్తే రహదారి సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంటుంది. అయితే ప్రాజెక్టు నిర్మాణ వ్యయం, మార్గం, పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేయాల్సిన గడువు వంటి వివరాలు అధికారికంగా వెల్లడైన తర్వాతే స్పష్టత రానుంది. కేంద్రం ఆమోదం తెలిపినట్లు ప్రకటించినప్పటికీ తదుపరి పరిపాలనా అనుమతులు, సాంకేతిక ప్రక్రియలు, నిధుల కేటాయింపు వంటి దశలు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నాయి.

**- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం**

తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య రవాణా అనుసంధానాన్ని మెరుగుపరిచే మరో ముఖ్యమైన ప్రతిపాదన కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం. జాతీయ రహదారి ఎన్‌హెచ్-167కే పై నిర్మించనున్న ఈ బ్రిడ్జికి సంబంధించిన శంకుస్థాపన ప్రతిపాదనకు కేంద్రమంత్రి ఆమోదం తెలిపినట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి అయితే 2 రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరింత సౌలభ్యం కలగడంతో పాటు.. ప్రాంతీయ రవాణా, పర్యాటక రంగాలకు ఊతం లభించే అవకాశం ఉంది. వంతెన నిర్మాణానికి సంబంధించిన తదుపరి పనులు, శంకుస్థాపన తేదీ, నిర్మాణ షెడ్యూల్‌పై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

**- హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే జాతీయ రహదారి ఎన్‌హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనపైనా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించినట్లు కోమటిరెడ్డి తెలిపారు. డీపీఆర్‌లో ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణ వ్యయం, అవసరమైన భూసేకరణ, సాంకేతిక అంశాలు వంటి వివరాలను పరిశీలించనున్నారు. ఈ రిపోర్టు ఆధారంగా ప్రాజెక్టు అమలు దిశగా తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

**- తెలంగాణకు ఐదు రోప్‌వేలు.. మూడు కొత్త ఆర్వోబీలు**

రాష్ట్రంలో రవాణా సౌకర్యాలను విస్తరించే లక్ష్యంతో పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. రోప్‌వేలు పర్యాటక ప్రాంతాలకు చేరుకోవడాన్ని సులభతరం చేయడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలుగా ఉపయోగపడే అవకాశం ఉంది. మరోవైపు సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్వోబీలు) నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. రైల్వే క్రాసింగ్‌ల వద్ద వాహనాల రద్దీని తగ్గించడం, రైళ్ల రాకపోకల కారణంగా ప్రయాణికులు ఎదుర్కొనే నిరీక్షణను తగ్గించడం కోసం ఈ ఆర్వోబీలను నిర్మించనున్నారు.

**- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేపైనా చర్చ**

హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. ఈ రహదారి ప్రాజెక్టు ముందుకు సాగితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య అనుసంధానం మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని 34 పనులకు సీఆర్ఐఎఫ్ నిధులు కేటాయించాలని మంత్రి కోమటిరెడ్డి కోరగా ఈ అంశంపై సంబంధిత అధికారులకు కేంద్రమంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం మార్గంలోని ఎన్‌హెచ్-65 విస్తరణ పనులను వేగవంతం చేసే అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. పుల్లూరు నుంచి నల్గొండ వరకు పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనపైనా చర్చించారు.

**- ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు గడ్కరీకి ఆహ్వానం**

ఇక హైదరాబాద్‌లో నవంబర్ 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన నితిన్ గడ్కరీ ఆ కార్యక్రమానికి హాజరవుతానని తెలిపినట్లు మంత్రి పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**- గోదావరి - కావేరి అనుసంధానంపై చంద్రబాబు విజన్**

ఈ భేటీలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 'పోలవరం - కావేరి', 'గోదావరి - కావేరి' నదుల అనుసంధానంపై ఇరువురు సీఎంలు చంద్రబాబు, విజయ్ విస్తృతంగా చర్చించారు. సముద్రంలో వృథాగా కలిసిపోతున్న వేల టీఎంసీల గోదావరి వరద జలాలను మళ్లించడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లోని లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుందని చంద్రబాబు అన్నారు. ఈ కీలక ప్రాజెక్టును సాకారం చేయడానికి పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని ఏపీ సీఎం ప్రతిపాదించారు.

**- బనకచర్ల ద్వారా నీటి మళ్లింపు ప్రణాళికలు**

గోదావరి - కావేరి అనుసంధానంలో భాగంగా ఏపీ ప్రభుత్వం గోదావరి- బనకచర్ల కనెక్టివిటీని ప్రధానంగా ప్రతిపాదిస్తోంది. ఈ ప్రణాళిక ప్రకారం గోదావరి జలాలను మొదట కృష్ణా నదికి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఆ తర్వాత బొల్లాపల్లి నుంచి బనకచర్లకు, అక్కడి నుంచి పెన్నా నదికి నీటిని తీసుకెళ్లేలా ప్లాన్ చేశారు. చివరగా కండలేరు రిజర్వాయర్ మీదుగా కావేరీ నదికి గోదావరి నీటిని చేరవేసేలా నమూనాను సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వం మరియు పొరుగు రాష్ట్రాల సమన్వయంతో ఈ ప్రాంతీయ జల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు.సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం విజయవాడ పున్నమిఘాట్ కు వెళ్లనున్నారు విజయ్. సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్ తో కలిసి విజయవాడ ఉత్సవ్ లో పాల్గొననున్నారు. మంత్రి నారా లోకేష్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఇటీవలి కాలంలో చాలామందే గంజాయితోపాటు అక్రమ బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తూ డీఆర్ఐ అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా మరోసారి ఇలాంటి ఘటనే జరిగింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ లో భారీ మొత్తంలో హైడ్రోపోనిక్ గంజాయి లభ్యమవడం కలకలం రేపుతోంది. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్ కు వచ్చిన ఓ ప్రయాణికుడి దగ్గర దాదాపు రూ.2.71 కోట్ల విలువ చేసే గంజాయి లభ్యం అయింది.

ఈ మేరకు ప్రయాణికుడి చెక్-ఇన్ లగేజీలోని ఎలక్ట్రిక్ వాటర్ గీజర్ లో అత్యంత తెలివితో దాచి తరలిస్తున్న సుమారు 7.75 కిలోల హై-గ్రేడ్ హైడ్రోపోనిక్ వీడ్ ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత నిందితుడ్ని అరెస్ట్ చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతోనే ఎయిర్ పోర్టులో తనిఖీలు నిర్వహించిన డీఆర్ఐ అధికారులు.. ప్రయాణికుడి చెక్ ఇన్ బ్యాగేజిలో ఎలక్ట్రిక్ గీజర్ గుర్తించామని తెలిపారు. అయితే అనుమానం వచ్చి గీజర్ ను తెరిచి పరిశీలించగా 73 ప్యాకెట్లలో గంజాయి ఉన్నట్లు గుర్తించామని వివరించారు. ఈ హై గ్రేడ్ హైడ్రోపోనిక్ వీడ్ విలువ అంతర్జాతీయ అక్రమ మార్కెట్ లో సుమారు రూ.2.71 కోట్లు ఉంటుందని అంచనా వేశారు.

అలాగే స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ఎన్డీపీఎస్ చట్టం, 1985 నిబంధనల ప్రకారం సీజ్ చేశామన్నారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడిన ప్రయాణికుడిని అదే చట్టం కింద అరెస్టు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు డీఆర్ఐ అధికారులు తెలిపారు. ఇక ఈ నెట్ వర్క్ వెనుక ఉన్న స్థానిక ముఠాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఇటీవలికాలంలో ఇలాంటి వరుస సంఘటనలు జరుగుతున్న క్రమంలో రాష్ట్రంలోని అధికారులు అప్రమత్తం అయ్యారు. డ్రగ్స్ అక్రమ సరఫరాపై నిఘా పెంచారు.

## దేవీనవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను

ముఖ్యమంత్రి విజయ్, విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనడం, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజల మధ్యకు రావడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తమిళనాడు సీఎం విజయ్ అన్నారు. తనకు ఆహ్వానం పలికి, అపారమైన అభిమానాన్ని చూపించిన విజయవాడ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నదుల అనుసంధానంపై చర్చించేందుకు విజయవాడకు రావడం సంతోషంగా ఉంది అని పేర్కొన్నారు. విజయవాడ ప్రజలు చూపించిన ఆదరణ, అభిమానానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.'థాంక్యూ విజయవాడ.. మీ అభిమానానికి, నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు'అంటూ తన ప్రసంగాన్ని సీఎం విజయ్ ముగించారు.

**- విజయవాడ రావడం సంతోషంగా ఉంది: సీఎం చంద్రబాబు**

విజయవాడ ఉత్సవ్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రావడం ఎంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన కొద్ది కాలంలోనే పార్టీని స్థాపించి, ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం విజయ్ సాధించిన విజయమని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రాలు వేరైనా తమ అభిమతం ఒక్కటేనని, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ఏదైనా సాధించవచ్చని సీఎం చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో పాటు భవిష్యత్తులోగోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి ఐదు నదులను అనుసంధానం చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ మహత్తర లక్ష్య సాధనకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

**- విజయవాడ ఉత్సవ్‌కు దళపతి విజయ్ రావడం కొత్త ఉత్సాహం: సీఎం చంద్రబాబు**

2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలవడం ఖాయమని సీఎం చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ ఉత్సవ్‌కు దళపతి విజయ్ రావడం కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని, శారీరక పరిమితులు ప్రతిభకు అడ్డంకి కావని కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా నిరూపించారని ప్రశంసించారు. ఉత్సవాల్లో నిర్వహించిన కళా ప్రదర్శనలు అద్భుతంగా ఆకట్టుకున్నాయని, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారనిసీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్‌తో పాటు ఆధ్యాత్మికత కూడా సమాజానికి అవసరమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఉత్సవాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావన మరింత పెరుగుతుందని, విజయవాడ ఉత్సవ్‌తో పాటు ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు విజయవంతం కావాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

**- సీఎం విజయ్ రావడం సంతోషం: ఎంపీ కేశినేని చిన్ని**

దక్షిణాది రాష్ట్రాల్లో భాషలు వేరైనా సాంస్కృతిక మూలాలు, సంప్రదాయాలు ప్రజలను కలిపి ఉంచుతున్నాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0కు తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. దార్శనికత కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో పాటు దేశవ్యాప్తంగా నదుల అనుసంధానానికి దిశానిర్దేశం చేస్తున్న నాయకుడిగా చంద్రబాబు నాయుడిని అభివర్ణించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై పాల్గొని విజయవాడ ప్రజల్లో ఉత్సాహాన్ని నింపడం ఆనందంగా ఉందని, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రులిద్దరికీ కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ ఉత్సవ్ 2.0 ద్వారా నగర సాంస్కృతిక వైభవాన్ని, ఆధ్యాత్మిక విశిష్టతను, కళాకారుల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నం కొనసాగుతోందని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమ, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వల్లరామయ్య, కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభి, తేజస్వి, టిడిపి పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి బుద్ధ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మోదీ, షా చుట్టూ ఉచ్చు బిగుస్తోంది

దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రకటించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీతో పాటు ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, సీపీఎం, సీపీఐ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) సహా 'ఇండియా' కూటమికి చెందిన పలువురు కీలక నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసనల అనంతరం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు రాహుల్ ఈ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "మాకు సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి, న్యాయవ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. వారు తమ బాధ్యతను నిర్వర్తిస్తారని ఆశిస్తున్నాం. ఏ వ్యవస్థ స్పందించినా, స్పందించకపోయినా మా రాజకీయ, ప్రజా ప్రతిఘటన కొనసాగుతుంది, అంతిమంగా విజయం సాధిస్తుంది" అని అన్నారు. రాజ్యాంగాన్ని దెబ్బతీసి అంత సులభంగా తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. ఓట్ల దొంగతనానికి పాల్పడిన వారిపై చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. "ఈ కుట్రకు ప్రధాన రూపశిల్పి మోదీ కాగా, అమలు చేసిన వ్యక్తులు అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ అని, వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని వారు గ్రహించాలి. వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని హామీ ఇస్తున్నాం" అని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**- జంతర్ మంతర్‌పై పోరాటం**

నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్ హోదాను ప్రభుత్వం రద్దు చేయడాన్ని పలువురు నేతలు తీవ్రంగా ఖండించారు. "ప్రభుత్వంలోని భయం ఈ నిర్ణయంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. జంతర్ మంతర్‌ను తిరిగి దక్కించుకోవడానికి పోరాడతామని సీపీఐ నేత డి. రాజా ప్రకటించారు.

రాబోయే రోజుల్లో 'ఇండియా' కూటమి చేపట్టే ప్రతీ కార్యక్రమంలోనూ జంతర్ మంతర్ వైపు మార్చ్ చేసే ప్రయత్నం ఉంటుందని కూటమి వర్గాలు తెలిపాయి. సీపీఎం పొలిట్‌బ్యూరో సైతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. శాంతియుత నిరసన హక్కును బలహీనపరిచేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని ఆరోపించింది.

ఈ సమావేశంలో పాల్గొన్న ఇతర నేతలు సైతం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజ్యాంగం ప్రమాదంలో పడటంతోనే ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమయ్యాయని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. 'ఓట్ల దొంగతనం'లో పాలుపంచుకున్న జ్ఞానేశ్ కుమార్, ఇతర అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదని తృణమూల్ నేత సాగరిక ఘోష్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఈసీని పదవి నుంచి తప్పించే వరకు ఉద్యమం కొనసాగుతుందని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు.

## హాస్టళ్లకు సరుకుల సరఫరా స్థానిక వెండర్లకే ఇవ్వాలి

సరకుల సరఫరా కోసం నూతనంగా ప్రవేశపెట్టిన పీఎంయూ (ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విధానం స్థానిక చిరు వ్యాపారుల ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి, డీపీసీ (జిల్లా కొనుగోలు కమిటీ) ద్వారా స్థానిక వ్యాపారులకే సరఫరా బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. అప్పుడే చిరు వ్యాపారులకు భరోసా ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులకు అవకాశం ఇవ్వకుండా ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక భారీగా కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. "కేవలం కమీషన్ల కోసం కక్కుర్తిపడి, ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఒక సంస్థకు టెండర్లు కట్టబెట్టడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకుని పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో, రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఆత్మకూరుకు 'వాయుపుత్ర మార్గ్

**- రూ.8.91 కోట్లతో 2.2 కి.మీ. నాలుగు వరుసల రహదారి- మంగళగిరి నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్**





ఆత్మకూరు(ప్రశ్న న్యూస్) ఆత్మకూరు పట్టణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమైంది. జాతీయ రహదారి ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్లతో అభివృద్ధి చేసిన 2.2 కిలోమీటర్ల నాలుగు వరుసల రహదారి అందుబాటులోకి వచ్చింది. ఈ రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా నామకరణం చేశారు. మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వర్చువల్‌గా రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, ప్రాంతీయ అభివృద్ధికి ఊతమివ్వడమే రహదారి నిర్మాణ ఉద్దేశమని పేర్కొన్నారు.

### రోడ్లకు రూ.6.31 కోట్లు

ఆత్మకూరు ప్రజలు జాతీయ రహదారికి చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనేవారని వివరించారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విజ్ఞప్తి మేరకు పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు.పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 6.31 కోట్లతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిని అభివృద్ధి చేశారు. మరో రూ. 2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు వినియోగించనున్నారు.

### ఆంజనేయుడి పేరుతో..

రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉందని, భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఆ విగ్రహం ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారికి 'వాయుపుత్ర మార్గ్'గా పేరు పెట్టినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

### పల్లె పండుగతో రహదారుల అభివృద్ధి

రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్లకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. పల్లె పండుగ 3.0లో భాగంగా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

### వీర్లగుడిపాడు వంతెనకు చర్యలు

సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు, చర్యలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధార కింద రూ. 72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీముల పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు హాజరయ్యారు.

## రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు

**- సబితా ఇంద్రారెడ్డి**

**హైదరాబాద్** మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 2,000 ఎకరాల భూములు ప్రభుత్వం లాక్కుంది. అసలు ఎందుకు భూములు తీసుకుంటున్నారు.. ఈ భూదాహం ఏంటని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడారు.దేని కోసం తీసుకుంటున్నారో చెప్పకుండా రైతులను ఎందుకు రోడ్డున పడేస్తున్నారు రేవంత్ రెడ్డి?రోడ్ల పేరిట రైతుల వద్ద నుంచి వేల ఎకరాలు లాక్కుంటున్నారు.

కొత్వాల్గూడ నుంచి కొడంగల్కు.. అలాగే మహేశ్వరం నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు వేస్తున్నారు. ఆల్రెడీ రోడ్డు మార్గాలు ఉండగా.. మళ్లీ భూములు లాక్కొని కొత్తగా రోడ్లు వేయాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు.అవసరం లేకున్నా.. తమ వ్యక్తిగత స్వార్థం కోసం రోడ్లు వేస్తున్నారే తప్ప.. ప్రజలకు ఉపయోగం లేదని అన్నారు.బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కాలేదు.. భూసేకరణ చేయమని రాష్ట్ర ప్రభుత్వానికి మేం చెప్పలేదని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఒకవేళ వాళ్లు బుల్లెట్ ట్రైన్ పేరిట భూసేకరణ చేస్తుంటే.. అది ఇల్లీగల్ అని కేంద్రమంత్రి స్పష్టం చేశారని గుర్తు చేసారు.మరి.. బహదూర్గూడ రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కొని, రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేసిన రేవంత్ ప్రభుత్వం దీనికి ఏం సమాధానం చెప్తుంది అసలు బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ఖరారు కానప్పుడు.. ఏ ఉద్దేశంతో బహదూర్గూడ భూములు తీసుకున్నారు బుల్లెట్ ట్రైన్ ఎక్కడ వస్తుందో కేంద్ర ప్రభుత్వానికే తెలియనప్పుడు.. రేవంత్ ప్రభుత్వం రాష్ట్ర రైతులను ఎందుకు భయపెట్టిస్తున్నారని అమె నిలదీసారు.

## హైదరాబాద్కు చేరుకున్న భారత్, వెస్టిండీస్ క్రికెట్ జట్లు

**హైదరాబాద్** అక్టోబర్ 14న ఉప్పల్ స్టేడియంలో నాలుగో టీ20 మ్యాచ్ లో పాల్గొనేందుకు భారత్, వెస్ట్ ఇండీస్ క్రికెట్ జట్లు హైదరాబాద్ కు చేరుకున్నాయి.

తరువాత ఆటగాళ్లు ప్రత్యేక బస్సుల్లో స్టార్ హోటల్కు వెళ్లారు. ఈ నేపథ్యంలో విమానాశ్రయం నుంచి హోటల్ వరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## స్కూటీలు దొంగతనం చేస్తున్న ఐదుగురు నిందితుల అరెస్ట్

**గుంటూరు** నగర పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాలు దొంగిలించబడుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీనిపై నిఘా పెట్టిన లాలాపేట పోలీసులు ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.ప్రధాన నిందితుడు షేక్ కరీముల్లా. అతనితో పాటు షేక్ మాదర్ వలీ, షేక్ జాఫర్ సాదిక్, షేక్ మస్తాన్ వలి, మరో మైనర్ నిందితుడిని పట్టుకున్నారు.

వీరంతా నల్లచెరువు, సంపత్ నగర్ నివాసులు. బృందంగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు.నల్లపాడు, పాత గుంటూరు, పట్టాభిపురం, సత్తెనపల్లి పరిధుల్లో దొంగతనాలు చేశారు. వీరి దగ్గర నుంచి 21 సుజుకి స్కూటర్లను రికవరీ చేశారు. వీటి మార్కెట్ విలువ సుమారు ?20 లక్షలు.దొంగిలించిన వాహనాలను తురకపాలెంలోని మధ్యవర్తి ద్వారా కంటైనర్లలో చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు.

# మడ అడవులే.. తీరానికి రక్షాకవచం

### 100 హెక్టార్లలో 3 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

### వాల్టా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తాం: ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు



సంఘమేశ్వరం(ప్రశ్న న్యూస్) మడ అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత, మానవ మనుగడకు భరోసా లభిస్తుందని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు అన్నారు. ప్రకృతి ప్రసాదించిన విలువైన వృక్ష సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సంఘమేశ్వరంలో మంగళవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయంగా మడ మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 100 హెక్టార్ల విస్తీర్ణంలో మూడు లక్షల మడ మొక్కలను నాటే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఇంధనం కోసం మడ అడవులను విచ్చలవిడిగా నరికివేయడంతో విలువైన ప్రకృతి సంపదకు నష్టం వాటిల్లిందని నాగబాబు ఆవేదన వ్యక్తం చేశారు. అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యతను విస్మరిస్తే పర్యావరణానికి, చివరకు మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు.

### వృక్ష సంపదకు చట్ట రక్షణ

వృక్ష సంపద పరిరక్షణకు రాష్ట్రంలో చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలులో లోపాలున్నాయని నాగబాబు పేర్కొన్నారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెట్ల నరికివేతపై కఠిన నిబంధనలు ఉన్నాయని, మన రాష్ట్రంలోనూ వృక్ష సంపద రక్షణకు వాల్టా చట్టాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రతి మొక్క పర్యావరణానికి అందించే ప్రయోజనాలు అమూల్యమైనవని, చెట్లను కాపాడితే అవే మనల్ని కాపాడతాయని అన్నారు.

### భూమిని కాపాడుకోవడం మన బాధ్యత

ఇల్లు, ఊరు, దేశం నచ్చకపోతే మారవచ్చని.. కానీ భూమి నివాసయోగ్యంగా లేకపోతే ఎక్కడికి వెళ్లగలమని నాగబాబు ప్రశ్నించారు. భూమిపై జీవనం కొనసాగాలంటే ప్రకృతిని పరిరక్షించడం ఒక్కటే మార్గమన్నారు. వాయు, జల కాలుష్యాలు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ప్రకృతిలోని ప్రతి చెట్టు, ప్రతి జీవి పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. మడ అడవులు, వృక్ష సంపద, జల వనరులను పరిరక్షిస్తూ సమస్త జీవరాశులతో సహజీవనం చేయాలని పిలుపునిచ్చారు. భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రకృతి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కమిషనర్ బి.ఎన్.ఎన్. మూర్తి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, డీఎఫ్‌వో త్రిమూర్తులరెడ్డి, ప్రజా ప్రగతి సేవా సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అశ్వారావుపాలెంలో పార్కు ప్రారంభం

అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెంలో రూ. 15 లక్షలతో నిర్మించిన పార్కును నాగబాబు ప్రారంభించారు. గ్రామస్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు సేదతీరడానికి ఈ పార్కు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ మాజీ సర్పంచి, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహక దళ్ సభ్యుడు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఈ పార్కును ఏర్పాటు చేశారు.

అదే ప్రాంగణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వెంకట కృష్ణారావు విగ్రహాన్ని నాగబాబు ఆవిష్కరించారు. అనంతరం పల్లె పండుగ 1.0, 3.0 కార్యక్రమాల కింద సుమారు రూ. 54.60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

## కామ్రేడ్ గుండా మల్లేష్‌కు విప్లవ జోహార్లు

**- ఎర్రజెండా సాక్షిగా ఘన నివాళులు**



**మందమర్రి:** కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి సందర్భంగా ఈరోజు మందమర్రి పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ×సీపీఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ మాట్లాడుతూ కామ్రేడ్ గుండా మల్లేష్ తన జీవితాన్ని పేదలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం అంకితం చేసిన గొప్ప ప్రజా నాయకుడని కొనియాడారు. ఎర్రజెండా ఆశయాల కోసం, శ్రమజీవుల విముక్తి కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం, పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాడటమే కామ్రేడ్ గుండా మల్లేష్‌కు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. నేటి సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్మికుల సమస్యలు, పేదల కష్టాలపై వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆర్ వెంకన్న ంఎజఈ జిల్లా సహాయ కార్యదర్శి ఆంటోనీ దినేష్ ఓఆ రసూల్ జక్కన బోయిన సమేందర్ హమాలి సంఘం నాయకులు. ఆ. సంపత్ సాగే పోశం పూరెల్ల శ్రీనివాస్ ఆవుల కుమార్ పూరెల్ల మహేష్ దామరకుంట రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి కార్మికులకు దసరా ధమాకా..

- ఒక్కొక్కరికి రూ.1.53 లక్షల వరకు బోనస్ - సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు దసరా బోనస్
- కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లింపు - పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా
- అర్హులైన పర్మినెంట్ కార్మికులకు గరిష్ఠంగా రూ.1,53,913
- పండుగకు ముందే ఖాతాల్లో బోనస్ జమ చేయనున్న యాజమాన్యం



**హైదరాబాద్** దసరా పండుగ వేళ సింగరేణి కార్మికులకు తీపి కబురు అందింది. సంస్థలో పనిచేస్తున్న శాశ్వత కార్మికులతో పాటు కాంట్రాక్టు వారికీ బోనస్ ప్రకటించారు. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున చెల్లించనున్నారు. మరోవైపు సంస్థ నికర లాభాల్లో 34 శాతం వాటాను పర్మినెంట్ కార్మికులకు పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణి కార్మికుల ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. సింగరేణి సాధించిన నికర లాభాల్లో 34 శాతాన్ని పర్మినెంట్ కార్మికులకు బోనస్‌గా అందించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు అర్హులైన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ. 1,53,913 వరకు అందనుంది. పండుగకు ముందే ఈ మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. గతేడాది తరహాలోనే ఈసారి కూడా కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించనున్నారు. ఒక్కొక్కరికి రూ. 5,500 చొప్పున చెల్లించనున్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లోనూ దసరా ఆనందం నిండనుంది. బొగ్గు గనుల్లో రేయింబవళ్లు శ్రమిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని యాజమాన్యం పేర్కొంది. పండుగ వేళ బోనస్ ప్రకటనతో కార్మికుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# తెలంగాణలో ఎల్‌నినో దెబ్బ.. తీవ్ర సాగు, తాగునీటి ఎద్దడి

**- యాసంగి పంటలపై ప్రభుత్వం కీలక ప్రకటన**

**ఖమ్మం** తెలంగాణ రాష్ట్రాన్ని ఎల్ నినో గండం ముంచెత్తుతోంది. రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేస్తోంది.రానున్న రోజుల్లో తాగునీరు, సాగునీటితోపాటు విద్యుత్ సరఫరాపై కూడా తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతాంగం యాసంగి సాగు విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న పంటలను ఎలాగోలా కాపాడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని.. అయితే భవిష్యత్తులో ఎదురయ్యే తీవ్ర నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని.. ఈసారి యాసంగి పంటలు వేయకుండా రైతులు సహకరించాలని కోరారు.ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో మంత్రులు పర్యటించారు. అనంతరం ఎల్ నినో పరిస్థితులపై చర్చించారు. రానున్న రోజుల్లో వర్షాలు ఆశించిన మేర కురిసే అవకాశం ఉండకపోవచ్చన్నారు. వ్యవసాయానికి అవసరమైన నీటితోపాటు ప్రజలు తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు సాధ్యమైనంత వరకు నీటిని అందించి వాటిని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. రెండో పంట వేసి ఆ తర్వాత నీరు అందక పంటలు ఎండిపోయినట్లయితే.. రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రులు హెచ్చరించారు. అందువల్ల పరిస్థితులను అర్థం చేసుకుని యాసంగి సాగు విషయంలో ప్రభుత్వం సూచనలను పాటించాలని రైతులను కోరారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతమేర తగ్గించే అవకాశం ఉందని తెలిపారు.నీటి లభ్యతపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోతే, అది తాగునీటి సరఫరాతో పాటు సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పంటలు వేసే ముందు నీటి లభ్యతను అంచనా వేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని ఆయన అన్నారు. వర్షపాతం లేకపోవడంతో పాటు, విద్యుత్ సరఫరాలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. బయటి మార్కెట్ నుండి నిత్యావసర విద్యుత్‌ను కొనుగోలు చేయడం రోజురోజుకు ఖరీదైనదిగా మారుతోందని ఆయన అన్నారు. యూనిట్‌కు రూ. 15 చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రజలకు విద్యుత్ లభించని పరిస్థితులు కూడా ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రజలు అవసరమైనంత మాత్రమే విద్యుత్‌ను వాడుకుని డబ్బు ఆదా చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలను కవర్ చేస్తూ ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలలో అవగాహన పెంచాలని ఆయన సూచించారు. పంట కోత పూర్తయ్యే వరకు నీటి కొరతను నివారించడానికి, ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా చూసుకోవడానికి అధికారులు తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక వార్ రూమ్ మరియు టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయడంపై కూడా దృష్టి సారించింది.

కరువును ఎదుర్కొంటున్న జిల్లాలకు సహాయం అందించడానికి మరియు కరువు నివారణ చర్యలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అభ్యర్థించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుత 125 పనిదినాలకు అదనంగా, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో 50 రోజుల పనిని అభ్యర్థించే విషయాన్ని కూడా పరిశీలిస్తోంది.ఎల్ నినో ప్రభావం, కరువు పరిస్థితి, రైతుల సమస్యలు, తాగునీరు మరియు సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై చర్చించేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో త్వరలో ఒక ప్రత్యేక సమావేశం జరగనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే నెలల్లో ప్రభుత్వ పనితీరుకు మార్గదర్శకంగా ఉంటాయి.

# అన్నమే పరబ్రహ్మం.. ఆకలి తీర్చడమే మహాదానం

## అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ దర్శనం..



విజయవాడ(ప్రశ్న న్యూస్) అన్నమే పరబ్రహ్మ స్వరూపం.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడమే మహోన్నత సేవ.. సమస్త జీవులకు ఆహారాన్ని అందించే తల్లిగా, కరుణామయిగా కొలువుదీరిన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ధరించిన ఈ విశిష్ట అలంకారం భక్తుల్లో ఆధ్యాత్మిక భావాలను నింపింది. ఆలయానికి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.

### అన్నదానమే అసలైన సేవ

హిందూ ధార్మిక సంప్రదాయంలో అన్నపూర్ణాదేవిని అన్నానికి అధిదేవతగా, సకల జీవులకు ఆహారాన్ని ప్రసాదించే జగన్మాతగా ఆరాధిస్తారు. జీవుల మనుగడకు అన్నమే ఆధారం. ఆకలి తీర్చడం కేవలం ఒకరి శారీరక అవసరాన్ని తీర్చడం మాత్రమే కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటే పవిత్ర కార్యం. అందుకే భారతీయ సంస్కృతిలో అన్నదానానికి విశిష్ట స్థానం ఉంది. ఈ ఆధ్యాత్మిక సత్యాన్ని చాటిచెబుతూ అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు అభయమిచ్చారు.

### ప్రతి ఇంటా అన్నపూర్ణమ్మ కటాక్షం

అన్నపూర్ణాదేవి అలంకారం ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలనే గొప్ప సందేశాన్ని అందిస్తుంది. ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే మానవతా విలువను గుర్తుచేస్తుంది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, నిరుపేదలకు చేయూతనివ్వడం, ఆహారాన్ని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచిస్తుంది. సంపద ఎంత ఉన్నా, నలుగురితో పంచుకున్నప్పుడే దానికి సార్థకత చేకూరుతుందనే భావనను ఈ అలంకారం ప్రతిబింబిస్తుంది.

### అన్నదానంతో అమ్మవారి సేవా సందేశం

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు అన్నపూర్ణాదేవి అలంకారాన్ని చూసి పరవశించారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, సకల శుభాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదానం వంటి సేవా కార్యక్రమాలు కూడా అన్నదాన ప్రాముఖ్యతను చాటుతున్నాయి. భక్తులకు ఆహారం అందించడంతోపాటు సేవాభావాన్ని పెంపొందించే ఈ కార్యక్రమాలు ధార్మికతకు, మానవత్వానికి వారధిగా నిలుస్తున్నాయి.

### భక్తితో పాటు మానవత్వం..

దసరా శరన్నవరాత్రుల్లో రోజుకో అలంకారంలో దర్శనమిచ్చే జగన్మాత రూపాలు ఒక్కొక్కటి ఒక్కో ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తాయి. అందులో అన్నపూర్ణాదేవి అలంకారం ఆకలి తీర్చడంలోని గొప్పతనాన్ని, ఇతరుల కష్టాలను అర్థం చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. అమ్మవారిని పూజించడంతోపాటు ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం, ఆపన్నులకు అండగా నిలవడం ద్వారా దైవభక్తిని ఆచరణలో చూపాలని ఈ అలంకారం ప్రబోధిస్తోంది.అమ్మవారి అనుగ్రహం పొందడమే కాదు.. ఆమె చాటిన కరుణ, దయ, సేవాభావాన్ని జీవితంలో ఆచరించడమే నిజమైన భక్తి అనే సందేశంతో ఇంద్రకీలాద్రిపై అన్నపూర్ణాదేవి అలంకార దర్శనం భక్తులను ఆధ్యాత్మికతతో పాటు మానవతా మార్గంలో నడిపించింది.

# 252 సర్వే నెంబర్లు లో కబ్జా.?

- మా స్థలం మాకు ఇప్పించాలంటూ బాధితుల విజ్ఞప్తి
- ఈ స్థలం మాది అంటూ బోర్డు పెట్టిన బాధితులు
- కో-ఆపరేటివ్ స్థలం కబ్జా ఆందోళనలో బాధితులు






మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని 252 సర్వే నెంబర్లు 11 ప్లాట్లను కబ్జాకు పాల్పడి ఎవరు ఏం చేసుకుంటారో చేసుకోండి అన్నట్టుగా అధికారులతో సవాల్ విసురుతున్నారు. అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కో ఆపరేషన్ హౌసింగ్ సొసైటీ కి చెందిన ఈ స్థలాన్ని అదే సొసైటీకి చెందిన వ్యక్తి కబ్జా కు పాల్పడినట్టు ఆ సూసైడ్ కి చెందిన బాధితులు వెంచర్ వద్ద ఆందోళనకు దిగారు. దాదాపు ఇందులో 11 ప్లాట్లకు ప్లాట్లను కబ్జా చేశారని ఆరోపిస్తూ అందులో ఆ సొసైటీ కి సంబంధించిన బోర్డును పాతారు. ఈ వ్యవహారంపై కోర్టులో కేసు నడుస్తుండగా సదరు వ్యక్తి తమ ప్లాట్లను కబ్జా చేసి తమపై కోర్టులో కేసు వేశాడని ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం వివరాలు ఎలా ఉన్నాయి. గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో 252 సర్వే నెంబర్లు అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కోఆపరేషన్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే కొంతమంది ఉద్యోగులు సొసైటీ ద్వారా ఈ ప్లాట్ ను కొనుగోలు చేసుకున్నారు. అయితే ఇక్కడ వరకు బాగానే ఉన్నా ఆ సొసైటీ కి చెందిన ప్రతినిధి దాదాపు 11 ప్లాట్లు ( 200 గజాలు ) ఉన్న ప్లాట్ ను కబ్జా చేసుకుని తన ఆధీనంలోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధ్యతలు తమ ప్లాట్ల వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు.

### రూపాయి రూపాయి జమ చేసి ప్లాట్లు కొన్నాం

రూపాయి రూపాయి జమ చేసుకొని ప్లాట్లు కొనుక్కున్నామని తీరా ఇప్పుడు తమ సొసైటీకి చెందిన ప్రతినిధి మా ప్లాట్లను కబ్జా చేసి మా పైనే కోర్టులో కేసు వేశారని, కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే సదరు వ్యక్తి 11 ప్లాట్ లలో మొరం తో చదును చేస్తూ నాదే ఈ ప్లాట్ లో అంటూ వ్యవహరిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తాము సొసైటీ ద్వారా ఈ ప్లాట్లను కొనుగోలు చేశామని, మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని సదరు వ్యక్తి మా పై కోర్టులో కేసు వేశారని, మాకు ఈ స్థలం తప్ప వేరే ఆధారం లేదని బాధితుల ఆరోపిస్తున్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా మా స్థలాలను సైతం మట్టితో చదును చేసి తన ఆధీనంలోకి ఉంచుకున్నారని, ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు సంబంధిత రెవెన్యూ అధికారులను, జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

# రాష్ట్రపతి రాక.. ఇంద్రకీలాద్రిపై ఆంక్షలు

## మధ్యాహ్నం 1 నుంచి వాహనాల నిలిపివేత

## ప్రోటోకాల్ దర్శన వేళల్లో మార్పులు..

## ఉదయం 6 నుంచి 9 గంటల వరకే అవకాశం



విజయవాడ,(ప్రశ్న న్యూస్) భారత రాష్ట్రపతి బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకోనున్న నేపథ్యంలో దేవస్థానం అధికారులు కీలక మార్పులు చేపట్టారు. అత్యున్నత భద్రతా ఏర్పాట్లలో భాగంగా కొండపైకి వాహనాల రాకపోకలను మధ్యాహ్నం 1 గంట నుంచి పూర్తిగా నిలిపివేయనున్నారు. ప్రోటోకాల్ దర్శన వేళల్లోనూ మార్పులు చేశారు. ఈ మేరకు దేవస్థానం పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ వివరాలు వెల్లడించారు.

### ఉదయం 9 గంటల వరకే ప్రోటోకాల్ దర్శనాలు

రాష్ట్రపతి పర్యటన దృష్ట్యా బుధవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ఉన్న ప్రోటోకాల్ దర్శన సమయాన్ని మరో గంట పొడిగించారు. ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ దర్శనాలకు అనుమతిస్తారు. మధ్యాహ్నం నుంచి ఎలాంటి ప్రోటోకాల్ దర్శనాలు ఉండవు. రాత్రి 7.45 గంటలకు కేటాయించిన ప్రోటోకాల్ స్లాట్‌ను కూడా రద్దు చేశారు. సాయంత్రం వేళల్లో దర్శనానికి టికెట్లు లేదా అనుమతులు పొందిన ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ మార్పులను గమనించాలని అధికారులు సూచించారు. వారు తప్పనిసరిగా ఉదయం 6 నుంచి 9 గంటల మధ్యలోనే అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### మధ్యాహ్నం నుంచి వాహనాల నిలిపివేత

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 1 గంట నుంచి కొండపైకి అన్ని రకాల వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. భద్రతా నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పర్యటన సమయంలో భద్రతా ఏర్పాట్లకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

### భక్తులు సహకరించాలి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంద్రకీలాద్రికి భక్తుల రాక ఎక్కువగా ఉంటోంది. ఈ తరుణంలో రాష్ట్రపతి పర్యటనకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతూనే సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్, ఈవో తెలిపారు. ప్రోటోకాల్ దర్శనాల కోసం ముందుగా అనుమతులు పొందినవారు మారిన సమయాలను గమనించాలని సూచించారు.రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విధించిన ఆంక్షలు, దర్శన వేళల్లో మార్పులను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రోటోకాల్ ప్రముఖులు, భక్తులు దేవస్థానానికి సహకరించాలని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్ కోరారు.

# గుంటూరు మేయర్ పీఠం.. పాతకాపుల ఎదురుచూపులు

## అభ్యర్థి ఎంపికపై టీడీపీలో చర్చ.. సేవలకు గుర్తింపు దక్కేనా.?

## శివ శిరీష పేరు ప్రచారంతో రాజకీయ వేడి.. స్థానిక నేతలకా.? కొత్తగా వచ్చిన వారికా.?



GMC main building, Opp. Gandhi Park, GT ROAD, Guntur

గుంటూరు(ప్రశ్న న్యూస్) గుంటూరు నగర మేయర్ పీఠం ఎవరికి దక్కుతుందన్న అంశం తెలుగుదేశం పార్టీలో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన స్థానిక నాయకులు, కార్యకర్తల ఆశలు ఒకవైపు.. మేయర్ అభ్యర్థిత్వంపై ప్రచారంలోకి వస్తున్న కొత్త పేర్లు మరోవైపు రాజకీయ సమీకరణాలను తెరపైకి తెస్తున్నాయి. సిమ్స్ కళాశాల అధిపతి భరత్‌రెడ్డి భార్య శివ శిరీష పేరు ప్రచారంలోకి రావడంతో అభ్యర్థి ఎంపికపై చర్చ మరింత వేడెక్కింది. అయితే ఆమె అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడలేదు. పార్టీ జెండా మోసిన వారికి ప్రాధాన్యం ఉంటుందా? ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అవకాశం కల్పిస్తారా? అన్న ప్రశ్నలు స్థానిక రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకోవాల్సి ఉండటంతో అందరి దృష్టి దానిపైనే నెలకొంది.

### పదవి ఒక్కటే.. ఆశావహులు ఎందరో

గుంటూరు నగరంలో టీడీపీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. పార్టీ కష్టకాలంలోనూ వెన్నంటి నిలిచినవారు, ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసినవారు తమ సేవలకు తగిన గుర్తింపు లభించాలని ఆశిస్తున్నారు. కీలక పదవుల కేటాయింపులో తమ అనుభవం, పార్టీతో అనుబంధం, ప్రజల్లో ఉన్న సంబంధాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు.

### వలస నేతలకు అవకాశాలపై చర్చ

ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరిన నాయకులకు కీలక పదవుల్లో ప్రాధాన్యం లభిస్తుందన్న ప్రచారం కొందరు స్థానిక కార్యకర్తల్లో చర్చకు కారణమవుతోంది. కొత్తగా పార్టీలోకి వచ్చినవారికి అవకాశాలు కల్పించడాన్ని తప్పుపట్టకపోయినా, దీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేసినవారిని విస్మరించకూడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మేయర్ ఎంపికలో ఏది ప్రామాణికం.?

నగర అభివృద్ధిపై అవగాహన, ప్రజలకు అందుబాటులో ఉండే స్వభావం, సామాజిక సేవ, పార్టీ పట్ల నిబద్ధత, స్థానిక సమస్యలపై స్పందన వంటి అంశాలను అభ్యర్థి ఎంపికలో పరిగణనలోకి తీసుకోవాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మహిళా నాయకులకు అవకాశాలు కల్పించే విషయంలోనూ పార్టీ సమగ్రంగా పరిశీలన జరపాలని స్థానిక శ్రేణులు కోరుతున్నాయి.
మొత్తంగా, గుంటూరు మేయర్ అభ్యర్థి ఎంపిక పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు, స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యం, నగర పాలనపై ఆశావహుల అవగాహన వంటి అంశాలతో ముడిపడింది. ప్రచారంలో ఉన్న పేర్లపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అధిష్ఠానం నిర్ణయం వెలువడిన తర్వాతే మేయర్ పీఠం విషయంలో రాజకీయ సమీకరణాలు స్పష్టమవుతాయి.

# కోవ్వూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం

## మహిళలకు 50 శాతం రిజర్వేషన్లపై

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హర్షం



కోవ్వూరు(ప్రశ్న న్యూస్) గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కోవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. కోవ్వూరు పంచాయతీలో రూ.65 లక్షలతో నిర్మించనున్న ఎనిమిది సీసీ రోడ్ల పనులకు మంగళవారం ఆమె స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు రూ.10 కోట్లతో 217 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రహదారులు

గ్రామాల్లో గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేయడంతో పాటు మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రెయిన్ల నిర్మాణంపై దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.
నియోజకవర్గంలోని మండలాల వారీగా మంజూరైన పనుల వివరాలు ఇలా ఉన్నాయి.

### బీసీలకు ప్రాధాన్యం.. మహిళలకు రిజర్వేషన్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం హర్షణీయమని ప్రశాంతి రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రస్తావిస్తూ.. పింఛన్ల పంపిణీ, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

### అవినీతి, వివాదాలకు తావులేని కోవ్వూరే లక్ష్యం

కోవ్వూరు నియోజకవర్గాన్ని అవినీతి, వివాదాలకు తావులేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.

# చంద్రఘంటగా భ్రమరాంబ.. రాత్రి కాళరాత్రి పూజలు

శ్రీశైలం (ప్రశ్న న్యూస్) శ్రీశైలంలో శ్రీభ్రమరాంబాదేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు అమ్మవారిని చంద్రఘంటాదేవి స్వరూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి నవావరణార్చనలు, విశేష కుంకుమార్చనలు, చండీహోమం, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, జపానుష్ఠానాలు, కుమారీపూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా స్వామివారికి రుద్రహోమం, రుద్రయాగాంగ జపాలు, రుద్రపారాయణలు నిర్వహించారు. సాయంత్రం నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం తదితర క్రతువులు చేపట్టారు. రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీ పూజలు, 10 గంటల నుంచి కాళరాత్రి పూజలు నిర్వహించనున్నారు.

### బాలికలకు కుమారీపూజ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలను అమ్మవారి స్వరూపాలుగా భావించి కుమారీపూజ నిర్వహిస్తున్నారు.
పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించి బాలికలను పూజించడం సంప్రదాయంగా వస్తోంది.

### చంద్రఘంటగా అమ్మవారు

నవదుర్గలలో మూడో రూపమైన చంద్రఘంటాదేవిని పది చేతులతో, ప్రశాంతమైన ముఖవర్చస్సుతో అలంకరిస్తారు. మస్తకంపై అర్ధచంద్రుడు గంట ఆకృతిలో ఉండటంతో ఈ రూపానికి చంద్రఘంట అనే పేరు వచ్చింది. అమ్మవారిని ఆరాధించడం వల్ల భయాలు తొలగి, శాంతి, ధైర్యం, సౌమ్యత కలుగుతాయని భక్తుల విశ్వాసం.

### రావణ వాహనంపై స్వామి, అమ్మవార్లు

దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రావణ వాహనంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించనున్నారు. అనంతరం గ్రామోత్సవం జరగనుంది.



# ఏఐ ఫొటోలు చూస్తే 'అది నేనేనా?' అనిపిస్తుంది: నటి శ్రియ ఆవేదన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ దుర్వినియోగంపై, ముఖ్యంగా డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలపై సీనియర్ నటి శ్రియ శరణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని, వాటిని చూసినప్పుడు 'అసలు అక్కడ ఉన్నది నేనేనా?' అనే సందేహం, ఆవేదన కలుగుతాయని ఆమె అన్నారు. కొన్నిసార్లు తన శరీరాకృతిని అసహ్యంగా మార్చేస్తున్నారని, ఒంటిపై ఉన్న దుస్తులను తొలగించి చిత్రీకరిస్తున్నారని శ్రియ వాపోయారు. ఇది కొందరికి నవ్వులాటగా అనిపించవచ్చని, కానీ తనకు మాత్రం ఎంతో బాధ కలిగిస్తుందని చెప్పారు. గతంలో తాను కూడా ఇలాంటి మార్ఫింగ్ ఫొటోల బారిన పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఏఐ టెక్నాలజీకి ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దానిని బాధ్యత లేకుండా వాడితే తీవ్రమైన ప్రమాదాలు తప్పవని, ఇలాంటి సాంకేతిక సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని కూడా శ్రియ గుర్తు చేసుకున్నారు. 2001లో 'ఇష్టం' సినిమాతో కెరీర్ ప్రారంభించినప్పటి రోజులను తలుచుకున్నారు. అప్పట్లో కారవాన్లు ఉండేవి కావని, చెట్ల కింద కూర్చుని భోజనం చేస్తూ పుస్తకాలు, సంగీతం గురించి మాట్లాడుకునేవాళ్లమని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఇయర్‌ఫోన్లతో తమ సొంత ప్రపంచంలో ఉంటున్నారని, కథలు చెప్పే విధానం కూడా పూర్తిగా మారిపోయిందని తెలిపారు. పరిశ్రమలో మహిళల పాత్రపై కూడా ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. నటీమణులుగా తెరపై కనిపించడం కంటే, తెర వెనుక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో మహిళలు ఉండటం ఎంతో అవసరమని ఆమె నొక్కి చెప్పారు. కథల ఎంపిక, పెట్టుబడుల వంటి కీలక అంశాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. కేవలం మహిళా ప్రాధాన్య చిత్రాలు తీసి, తెర వెనుక కీలక పనులన్నీ పురుషులే చేస్తే దాన్ని మహిళా చిత్రం అని ఎలా అంటామని ప్రశ్నించారు. పరిశ్రమలో మార్పు ఇప్పుడిప్పుడే మొదలైందని, ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.

# శ్రీకాంత్ తనయ మేధ తెరంగేట్రం



వెండితెరపై మరో వారసురాలు అరంగేట్రం చేస్తున్నది. హీరో శ్రీకాంత్ కుమార్తె మేధ మేక ఓ అందమైన ప్రేమకథా చిత్రం ద్వారా కథానాయికగా పరిచయమవుతున్నది. 'మైత్రీ ఇన్ లవ్' పేరుతో తెరకెక్కిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. జై జాస్తి హీరోగా ఇంట్రడ్యూస్ అవుతున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పృథ్వీ వనం దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నందిని రెడ్డి క్లాప్‌నివ్వగా, సాహు గారపాటి, అర్చన కెమెరా స్విఛాన్ చేశారు. 'న్యూఏజ్ రొమాంటిక్ కామెడీ చిత్రమిది. ప్రేమ, హాస్యం, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఆకట్టుకుంటుంది' అని చిత్రబృందం పేర్కొన్నది. ఈ చిత్రానికి సంగీతం: సాయిహర్ష, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: పృథ్వీ వనం.

# 'డర్టీ పిక్చర్-2'కు సన్నాహాలు



బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన చిత్రాల్లో 'ది డర్టీ పిక్చర్' ఒకటి. సిల్క్‌స్మిత జీవితం ఆధారంగా రూపొందించిన ఈ సినిమా 2011లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది.. విద్యాబాలన్ నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా జాతీయ పురస్కారాన్ని సొంతం చేసుకుంది. దాదాపు 15 ఏండ్ల విరామం తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందించబోతున్నట్లు నిర్మాత ఏక్తా కపూర్ ప్రకటించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాకు సీక్వెల్‌లో చెప్పాల్సిన కథ తనకు ఇప్పుడు దొరికిందని ఆమె అన్నారు. అయితే ఈ సీక్వెల్‌లో కథ ఎవరి జీవితం ఆధారంగా ఉంటుంది? దర్శకుడు.. నటీనటులెవరనే విషయాలపై ఏక్తాకపూర్ ఎలాంటి స్పష్టతనివ్వలేదు. తొలిభాగం మాదిరిగానే రెండో భాగం కూడా ఓ ప్రముఖ వ్యక్తి జీవితానికి సంబంధించిన కథతో రూపొందే అవకాశం ఉందని బాలీవుడ్ టాక్.

# ఆ లోటే నన్ను బాధించింది



తెలుగు తెరపై వచ్చినన్ని పౌరాణిక చిత్రాలు ఇతర భాషల్లో రాలేదనే చెప్పాలి. వెండితెరపై పౌరాణిక ఇతిహాసాలకు, పురాణ పాత్రలకూ తమ సృజనాత్మకతతో ప్రాణప్రతిష్ట చేసి, తెలుగు సినిమాకే గౌరవం తెచ్చారు నాటి దర్శకులు. అయితే.. వెండితెరపై వచ్చిన పౌరాణికాల విషయంలో తానెప్పుడూ సంతృప్తి చెందలేదని నిర్మొహమాటంగా చెప్పారు దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ 'నాకు పౌరాణికాలంటే ఇష్టం. అయితే.. వాటిని తెరకెక్కించిన విధానం విషయంలో మాత్రం సంతృప్తిగా లేను. తెరపై వాటికి పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదు. ఆ ఇతిహాసాలను రాసిన విధానానికీ, వాటిని తెరపైకి తెచ్చిన విధానానికీ చాలా వ్యత్యాసం ఉంది. ఆ లోటే నన్ను చాలా రోజులు బాధించింది. ఇప్పుడు దర్శకునిగా వాటిని తెరకెక్కించే అవకాశం నాకూ రావడంతో ' నువ్వేం చేయబోతున్నావ్?.. వాటిని ఎలా తీయబోతున్నావ్?' అని నాకు నేనే ప్రశ్నించుకున్నా. దీన్ని ఓ సవాలుగా స్వీకరించి 'వారణాసి'లో కొంత భాగం రామాయణాన్ని తెరకెక్కించాను' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలతో 'వారణాసి'పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెంచారు రాజమౌళి. ఇందులో మహేశ్ రుద్రగా, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ, కార్తికేయ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్నది.

# ప్రభాస్ 'కల్కి 2' మూవీకి సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్..

**- షూటింగ్ అప్‌డేట్!**



పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక సిక్వెల్ చిత్రం 'కల్కి 2'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ప్రభాస్ ఇతర సినిమాల కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కొద్దిగా నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం ప్రముఖ నటి సాయి పల్లవి ఎంపికైన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆమె ఈ అక్టోబర్ నెలలోనే సినిమా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కావాల్సి ఉండగా, మేకర్స్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సాయి పల్లవి తాను నటిస్తున్న 'రామాయణం' సినిమా ప్రమోషన్లు మరియు ఇతర కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టారు. ఈ పవిత్ర పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమా రిలీజ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆమె 'కల్కి 2' షూటింగ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక క్లారిటీ రానుంది.

# డిసెంబర్ 4న ఆర్య 'హలో కాదల్' విడుదల..

**- ఆసక్తి రేపుతున్న టీజర్**




తమిళ నటుడు ఆర్య కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'హలో కాదల్'. ఆర్య కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం విశేషం. ఈ చిత్రంలో నిఖిలా విమల్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. విడుదల తేదీ ప్రకటనతో పాటు మేకర్స్ ఒక ఆసక్తికరమైన టీజర్‌ను కూడా విడుదల చేశారు. ఈ టీజర్ ప్రస్తుతం ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. విమానంలో నిఖిలా విమల్, వైష్ణవి చైతన్య సంభాషించుకుంటున్న దృశ్యంతో ఈ టీజర్ ప్రారంభమవుతుంది. వైష్ణవి తన ప్రేమకథ గురించి వివరిస్తుండగా, అందులో ఆర్య కనిపిస్తారు. అయితే, తన భర్తతో తనకున్న ప్రేమకథ అంతకంటే ఆసక్తికరంగా ఉంటుందని నిఖిల చెబుతుంది. ఆమె భర్త పాత్రలో కూడా ఆర్యనే కనిపించడంతో కథలో ఏదో వైవిధ్యమైన మలుపు ఉందని స్పష్టమవుతోంది. మలయాళంలో విజయవంతమైన 'ప్రణయ విలాసం' చిత్రానికి దర్శకత్వం వహించిన నిఖిల్ మురళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని అందిస్తుండగా, జీవా శంకర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జూన్ నెలలోనే పూర్తికాగా, ప్రస్తుతం పోస్ట్-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆర్య, సాయేషా తమ సొంత నిర్మాణ సంస్థ 'ది షో పీపుల్' బ్యానర్‌పై కిషోర్ టితో కలిసి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# శంబాల హిట్.. మరో మిస్టిక్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు ఆది సాయికుమార్!



డైలాగ్ కింగ్ సాయికుమార్ తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆది సాయికుమార్, కెరీర్ మొదట్లో కొన్ని లవ్ స్టోరీలతో విజయాలను అందుకున్నారు. అయితే ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఆయనకు సరైన హిట్లు పడలేదు. దీంతో రూట్ మార్చిన ఆయన, గత ఏడాది 'శంబాల' అనే మిస్టిక్ థ్రిల్లర్‌తో వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సక్సెస్ ఆయన కెరీర్‌కు మంచి బూస్ట్ ఇవ్వడంతో పాటు, అభిమానుల్లో కొత్త జోష్ నింపింది.దఈ విజయం ఇచ్చిన ఊపుతో ఆది సాయికుమార్ మరోసారి అలాంటి జానర్‌లోనే సినిమా చేయడానికి సిద్ధమయ్యారు. త్రిశూల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్రశాంత్ జి రుద్రప్ప ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా. 'నవరసన్' దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అప్‌డేట్‌ను దసరా కానుకగా విడుదల చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఇక విడుదలైన కొత్త పోస్టర్‌లో దట్టమైన అడవి మధ్యలో ఉన్న పురాతన పూజా ప్రదేశం, వెలుగుతున్న నూనె దీపం, త్రిశూలాన్ని చుట్టుకుని పడగ విప్పిన పాము వంటి విజువల్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో ఒక శక్తివంతమైన దైవ రహస్యం, ఊహించని ట్విస్టులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం.

మరో విశేషం ఏమిటంటే, 'కాంతార' ఫేమ్ అంజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆయన అందించే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రేక్షకులను సీట్లలో కదలకుండా కూర్చోబెట్టేలా అదిరిపోయే స్క్రీన్ ప్లేతో రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



# నితిన్‌కి జోడీగా?

లక్కీభాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం, అనగనగా ఒకరాజు చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకున్నది హర్యానా అందం మీనాక్షి చౌదరి. ప్రస్తుతం నాగచైతన్యకు జోడీగా 'వృషకర్మ' చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న మీనాక్షికి మరో అద్భుతమైన అవకాశం వరించినట్టు ఫిల్మ్ వర్గాల్లో ఓ టాక్ బలంగా వినిపిస్తున్నది. 'సామజవరగమన' వంటి బ్లాక్‌బస్టర్ తెరకెక్కించిన రామ్ అబ్బరాజు దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ రొమాంటిక్ కామెడీ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో కథానాయికగా మీనాక్షి చౌదరి ఖరారైనట్టు వినికిడి. అయితే.. దీనిపై అధికారిక స్పష్టత రావాల్సివుంది. జనవరిలో సెట్స్‌పైకి వెళ్లే ఈసినిమాను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించనున్నట్టు సమాచారం.

# విద్యుత్ సరఫరా లో నేడు అంతరాయం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) నిర్వహణ పనుల్లో భాగంగా నేడు విద్యుత్తు సరఫరాల్లో పలు ప్రాంతాలలో అంతరాయం కలుగునుందని గుండ్ల పోచంపల్లి విద్యుత్ శాఖ ఏఈ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుండి 10:30 గంటల వరకు 33/11 కేవీ కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

**విద్యుత్ అంతరాయం కలిగే ప్రాంతాలు:**

గోద్రెజ్ ఇండస్ట్రీస్ లైన్, జి.పి. పల్లి, కె.వి. రెడ్డి నగర్ గ్రామం, మైపి విల్లాస్, అంతం విల్లాస్, సాయి గీత ఆశ్రమం రోడ్డు, పి.టి.సి, మై ప్లేస్ అపార్ట్‌మెంట్, లక్ష్మి ఇన్ఫ్రా, ప్రెస్టీజ్ పార్క్, జయదర్శిని ఎన్‌క్లేవ్, సోమాన్య స్టీల్స్, కార్తీక్ రెడ్డి గోడౌన్స్, కండ్లకోయ, కండ్లకోయ గ్రామం, ఎగ్ వుడ్ కంపెనీ, సాయిగీత రోడ్డు, సుతారిగూడ గ్రామం, టోల్‌గేట్, సర్వీస్ రోడ్డు, గుబ్బ స్టోరేజెస్, రైల్వే ట్రాక్ రోడ్డులో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

# రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల భూమయ్య

**నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి, టీ జాక్ అధ్యక్షుడు లచ్చి రెడ్డి**



జగిత్యాల (ప్రశ్న న్యూస్) తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల భూమయ్య నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి, టీ జాక్ అధ్యక్షుడు లచ్చి రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ప్రస్తుతం చిట్యాల భూమయ్య జగిత్యాల రూరల్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ నియామకాన్ని చేపట్టారు.జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల భూమయ్య నియామకం పట్ల రెవెన్యూ శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

# మచిలీపట్నం జనసేన మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

**పవన్ కల్యాణ్‌కు గడ్డం విజయలక్ష్మి ప్రతిపాదన..**

**పార్టీ పోర్టల్ ద్వారా దరఖాస్తు**



మచిలీపట్నం(ప్రశ్న న్యూస్) మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా తన పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని యువ న్యాయవాది గడ్డం విజయలక్ష్మి జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ పోర్టల్ ద్వారా తన దరఖాస్తును సమర్పించినట్లు ఆమె వెల్లడించారు. మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ ఆదేశాల మేరకు ఈ ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. మేయర్ పదవి బీసీ మహిళకు కేటాయించిన నేపథ్యంలో, పార్టీ అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని కోరినట్లు పేర్కొన్నారు.

**రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి..**

గడ్డం విజయలక్ష్మి మచిలీపట్నం నగర జనసేన అధ్యక్షుడు గడ్డంరాజు కుమార్తె. ఆమె మచిలీపట్నం జిల్లా కోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. న్యాయవృత్తిలో కొనసాగుతూనే జనసేన పార్టీ కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపుతూ, తన తండ్రితో కలిసి పార్టీకి సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. తన తండ్రి గడ్డంరాజు 2019 నుంచి బండి రామకృష్ణతో కలిసి జనసేన పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వివరించారు.తమ కుటుంబం యాదవ సామాజిక వర్గానికి చెందినదని విజయలక్ష్మి తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, ప్రజా సమస్యలపై ఆయన స్పందించే తీరు తనకు నచ్చడంతో పార్టీ పట్ల ఆసక్తి పెరిగిందని చెప్పారు. ఈ క్రమంలో తండ్రితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ తన వంతు సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

**పార్టీ సేవలకు గుర్తింపుగా అవకాశం కోరుతూ..**

రాజకీయాల్లో మహిళలకు అవకాశాలు కల్పించాలనే అంశంతోపాటు, బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విజయలక్ష్మి కోరినట్లు తెలిపారు. మచిలీపట్నం మేయర్ పదవి బీసీ మహిళకు కేటాయించిన నేపథ్యంలో జనసేన పార్టీ తరఫున పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.తనకు న్యాయవాదిగా ఉన్న అనుభవం, ప్రజల సమస్యల పట్ల అవగాహన, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న నేపథ్యం ప్రజా జీవితంలో ఉపయోగపడతాయని ఆమె అభిప్రాయపడినట్లు తెలిపారు. నగరంలోని ప్రజా సమస్యలను అర్థం చేసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే మేయర్ అభ్యర్థిత్వం కోసం ముందుకొచ్చినట్లు వివరించారు.

# వాటర్ కంపెనీలపై బీఐఎస్ అధికారుల తనిఖీలు చేపట్టాలి

**-సామాజిక ఉద్యమకారుడు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) వాటర్ కంపెనీల అక్రమాలు, బీఐఎస్ తనిఖీల నిర్వహణ తీరుపై ప్రజా ప్రశ్న దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని సామాజిక ఉద్యమకారుడు టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర డిమాండ్ చేశారు.ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, వాటర్ కంపెనీల కార్యకలాపాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీఐఎస్ ప్రమాణాల అమలు, నాణ్యతా పరీక్షలు, తనిఖీల పారదర్శకతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని సూచించారు.ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ యంత్రాంగం, సంబంధిత శాఖల బాధ్యత అని పేర్కొంటూ, ప్రజా ప్రశ్న దినపత్రికలో వచ్చిన కథనాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించి వాస్తవాలను వెలికితీయాలని, తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని రాజేష్ ఖన్నా గంగపుత్ర కోరారు.ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ఆ) వేదికగా స్పందిస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# రెస్టారెంట్ల వంటగదుల్లో నిఘా నేత్రాలు

**- వంట ఎలా చేస్తున్నారో కస్టమర్లకు కనిపించేలా చర్యలు- ఆహార భద్రతపై టీజీ సేఫ్ అధికారుల దృష్టి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**







హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం తింటున్నాం,కానీ ఆ ఆహారం ఎలా తయారు చేస్తున్నారు? వంటగదిలో పరిశుభ్రత పాటిస్తున్నారా? వంటకు ఉపయోగించే పదార్థాలు నాణ్యమైనవేనా? వండే సిబ్బంది శుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారా? అనే సందేహాలు చాలామంది వినియోగదారుల్లో ఉంటాయి. ఇలాంటి అనుమానాలకు తెరదించడంతో పాటు, ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో తెలంగాణలోని టీజీ సేఫ్ అధికారులు రెస్టారెంట్ల వంటగదులపై ప్రత్యేక దృష్టి సారించారు.

**వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచనలు**

రెస్టారెంట్లలో ఆహార తయారీ ప్రక్రియను పర్యవేక్షించేందుకు వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్వాహకులకు సూచించారు. వంట ఎలా చేస్తున్నారు? ఆహార పదార్థాలను ఎలా నిల్వ చేస్తున్నారు? వంటగదిలో పరిశుభ్రత పాటిస్తున్నారా? అనే అంశాలను పర్యవేక్షించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. కస్టమర్లకు వంట తయారీ విధానం కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో రెస్టారెంట్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో అధికారులు ఈ అంశాలపై చర్చించారు. వంటగదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు మరో నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ సభ్యులు తెలిపినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

**ఆహార నాణ్యతపై ప్రత్యేక నిఘా**

రెస్టారెంట్లలో వంటకు ఉపయోగించే ముడి పదార్థాల నాణ్యత, ఆహార పదార్థాల నిల్వ, వంటగదుల పరిశుభ్రత, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత వంటి అంశాలు అత్యంత కీలకం. నాణ్యత లేని పదార్థాలు, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. హైజీన్ రేటింగ్‌తో కూడిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రం పొందాలని రెస్టారెంట్ నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాల తయారీలో హానికరమైన రంగులను ఉపయోగించవద్దని, నిషేధిత పచ్చి గుడ్డుతో తయారు చేసే మయోనైజ్‌ను వినియోగించవద్దని హెచ్చరించారు.

**కెమెరాలు ఉంటేనే సరిపోదు**

వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఒక ముందడుగు మాత్రమే. వాటితో పాటు వంటగదులను నిత్యం శుభ్రంగా ఉంచడం, ముడి పదార్థాలను సురక్షితంగా నిల్వ చేయడం, పచ్చి పదార్థాలు--వండిన ఆహారాన్ని వేర్వేరుగా ఉంచడం, వంటకు ఉపయోగించే నీటి నాణ్యతను నిర్ధారించడం, వ్యర్థాలను సక్రమంగా తొలగించడం కూడా అవసరం. అలాగే వంట సిబ్బంది చేతుల పరిశుభ్రత, వంట పాత్రల శుభ్రత, వంట నూనె వినియోగం వంటి అంశాలపైనా నిరంతర పర్యవేక్షణ ఉండాలి. కెమెరాల్లో కనిపించే దృశ్యాలతో పాటు ప్రత్యక్ష తనిఖీలు, ఆహార నాణ్యత పరీక్షలు కూడా కొనసాగితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి.

**వినియోగదారుల్లో పెరగనున్న నమ్మకం**

రెస్టారెంట్లలో పారదర్శకత పెరిగితే వినియోగదారులకు ఆహార తయారీ విధానంపై అవగాహన ఏర్పడుతుంది. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చే సంస్థలను గుర్తించేందుకు కూడా అవకాశం ఉంటుంది. మరోవైపు, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ఆహార భద్రతను మరింత బలోపేతం చేయవచ్చు.

**ప్రజల ఆరోగ్యమే ముఖ్యం**

రుచికరమైన ఆహారం అందించడం ఎంత ముఖ్యమో, సురక్షితమైన ఆహారం అందించడం అంతకంటే ముఖ్యం. వ్యాపార లాభాల కోసం నాణ్యత, పరిశుభ్రత విషయంలో రాజీ పడకూడదు. రెస్టారెంట్ నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి. వినియోగదారులు కూడా ఆహార నాణ్యతపై అనుమానాలు ఉన్నప్పుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి.
వంటగదిలో పారదర్శకత.. ఆహారంలో నాణ్యత.. ప్రజల ఆరోగ్యానికి భరోసా! ఇదే ఆహార భద్రతా చర్యల ప్రధాన ఉద్దేశం కావాలి.

# నవరాత్రుల నాలుగో రోజు.. కూష్మాండ అమ్మవారి అవతారం విశిష్టత

**తన చిరునవ్వుతో సృష్టికి వెలుగులు నింపిన ఆదిశక్తి.. ఆరోగ్యం, ఐశ్వర్యం, శక్తిని ప్రసాదించే జగన్మాత**

**ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న**

నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజుకు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నవదుర్గలలో నాలుగో రూపమైన కూష్మాండ అమ్మవారిని ఈ రోజున భక్తులు భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. విశ్వమంతా అంధకారంలో ఉన్నప్పుడు తన దివ్యమైన చిరునవ్వుతో సృష్టికి వెలుగులు ప్రసాదించిన శక్తిస్వరూపిణిగా అమ్మవారిని పురాణాలు వర్ణిస్తాయి. సృష్టికి మూలశక్తిగా, జీవకోటికి శక్తిని అందించే జగన్మాతగా కూష్మాండ దేవిని కొలుస్తారు.

**కూష్మాండ అనే పేరు వెనుక అర్థం ఏమిటి?**

పురాణ సంప్రదాయాల ప్రకారం, 'కూష్మాండ' అనే పేరు సృష్టి ఆవిర్భావంతో సంబంధం కలిగి ఉంది. విశ్వం అంధకారంలో ఉన్నప్పుడు అమ్మవారు తన దివ్యమైన చిరునవ్వుతో బ్రహ్మాండాన్ని సృష్టించారని విశ్వాసం.
అందుకే ఆమెను సృష్టికి ఆదికారణమైన శక్తిగా భావిస్తారు. ఈ అవతారం సృష్టి, వెలుగు, జీవశక్తి, సానుకూలతలకు ప్రతీకగా నిలుస్తుంది. చీకటిని తొలగించి వెలుగును నింపినట్లే, మనిషి జీవితంలో నిరాశను తొలగించి ఆశను నింపే ఆధ్యాత్మిక సందేశాన్ని అమ్మవారి రూపం అందిస్తుంది.

**అమ్మవారి దివ్యరూపం.. విశిష్టత**

కూష్మాండ అమ్మవారు సింహంపై ఆసీనురాలై దర్శనమిస్తారు. ఆమెకు ఎనిమిది చేతులు ఉండటంతో అష్టభుజాదేవి అని కూడా పిలుస్తారు. వివిధ చేతుల్లో కమండలం, విల్లు, బాణం, కమలం, అమృతకలశం, చక్రం, గద వంటి వస్తువులు, ఆయుధాలను ధరించినట్లు సంప్రదాయ చిత్రణల్లో కనిపిస్తుంది. ఒక చేతిలో జపమాల ఉంటుంది.

ఈ రూపంలోని ప్రతి అంశానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక భావన ఉంది. ఆయుధాలు దుష్టశక్తులపై పోరాటానికి సంకేతాలైతే, అమృతకలశం శుభానికి, జీవశక్తికి ప్రతీకగా భావిస్తారు. జపమాల ఆధ్యాత్మిక సాధనను, కమలం పవిత్రతను సూచిస్తాయి. సింహవాహనం ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలుస్తుంది.

**సృష్టికి మూలశక్తిగా కూష్మాండ దేవి**

హిందూ పురాణ సంప్రదాయాల్లో కూష్మాండ అమ్మవారిని విశ్వసృష్టికి మూలమైన ఆదిశక్తిగా వర్ణిస్తారు. ఆమె చిరునవ్వు నుంచి వెలువడిన దివ్యశక్తి బ్రహ్మాండాన్ని ప్రకాశింపజేసిందని భక్తుల విశ్వాసం. సూర్యుడికి కూడా శక్తిని అందించే దేవతగా కొన్ని సంప్రదాయాల్లో ఆమెను ఆరాధిస్తారు. ఈ భావన మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. చిన్న చిరునవ్వు కూడా ఎదుటివారి జీవితంలో వెలుగును నింపగలదు. ఒక మంచి మాట నిరాశలో ఉన్నవారికి ధైర్యాన్ని ఇవ్వగలదు. మనలోని సానుకూలత ఇతరులకు స్ఫూర్తిగా నిలవగలదని కూష్మాండ అమ్మవారి అవతారం గుర్తుచేస్తుంది.

**నాలుగో రోజు పూజల విశిష్టత**

నవరాత్రుల నాలుగో రోజున భక్తులు కూష్మాండ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పుష్పార్చన, దీపారాధన, నైవేద్య సమర్పణతో పాటు అమ్మవారి నామస్మరణ, మంత్రపఠనం, ధ్యానం చేస్తారు. కొన్ని సంప్రదాయాల్లో గుమ్మడికాయను నైవేద్యంగా సమర్పించే ఆచారం కూడా ఉంది. అయితే పూజా విధానాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారవచ్చు.
కూష్మాండ అమ్మవారిని ఆరాధించడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం, మనోబలం, సానుకూల దృక్పథం కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. కుటుంబంలో సుఖశాంతులు నెలకొనాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించే శక్తి లభించాలని ప్రార్థిస్తారు.

**నేటి జీవితానికి అమ్మవారి సందేశం**

ప్రస్తుత కాలంలో ఒత్తిడి, నిరాశ, ఆందోళనలు మనిషి జీవితంలో భాగమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూష్మాండ అమ్మవారి అవతారం ఆశావాదానికి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. ఎంతటి కష్టాలు ఎదురైనా ఆశను కోల్పోకూడదు. చీకటి తర్వాత వెలుగు వచ్చినట్లే, కష్టకాలం తర్వాత మంచి రోజులు రావచ్చనే నమ్మకంతో ముందుకు సాగాలి.కుటుంబ సభ్యుల మధ్య ప్రేమాభిమానాలు పంచుకోవడం, అవసరంలో ఉన్నవారికి



సహాయం చేయడం, ప్రకృతిని గౌరవించడం, సమాజంలో సానుకూల వాతావరణాన్ని పెంపొందించడం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలి. ఇతరుల ముఖాల్లో చిరునవ్వు పూయించడం కూడా ఒక గొప్ప సేవేనని ఈ అవతారం మనకు తెలియజేస్తుంది.

**వెలుగు, సృష్టి, శక్తికి ప్రతీక**

నవరాత్రుల నాలుగో రోజు కూష్మాండ అమ్మవారిని ఆరాధించడం ద్వారా భక్తులు తమ జీవితాల్లో వెలుగు, ఆనందం, శక్తి నిండాలని కోరుకుంటారు. సృష్టికి మూలమైన ఆదిశక్తిగా ఆమెను కొలుస్తూ, ప్రతి ఒక్కరూ తమలోని మంచితనాన్ని వెలికితీసి సమాజానికి ఉపయోగపడేలా జీవించాలని సంకల్పించుకోవాలి.కూష్మాండ అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఇంటా ఆరోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రతి మనసులో ఆశాదీపం వెలగాలని కోరుకుందాం.

# అద్దె కార్లను తనఖా పెట్టి రూ.14.50 లక్షలు స్వాహా



కీసర (ప్రశ్న న్యూస్) అద్దెకు తీసుకున్న ఐదు కార్లను యజమానులకు తిరిగి ఇవ్వకుండా, ఇతరుల వద్ద తనఖా పెట్టి రూ. 14.50 లక్షలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రావెల్స్ నిర్వాహకుడు వడ్డె మహేష్ (42)ను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. వాహన బదిలీ కోసం నకిలీ సంతకాలు, పత్రాలు ఉపయోగించినట్లు దర్యాప్తులో గుర్తించారు. నిందితుడి నుంచి ఐదు కార్లు, మొబైల్ ఫోన్, అసలు ఫారం-35ను స్వాధీనం చేసుకున్నారు. జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ కేసును ఛేదించారు.

# ట్రాక్టర్ దపడి వ్యక్తి దుర్మరణం..

**పాపన్నపేట** ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి టైరు కింద నలిగి ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని గాజులగూడెం శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల సాయిలు (44) ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అతని కుటుంబంలో విషాదం నెలకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. గాజులగూడెం గ్రామానికి చెందిన సాయిలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన స్నేహితుడైన ట్రాక్టర్ డ్రైవర్ ఇస్మాయిల్‌తో కలిసి ఎంకెపల్లి గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటి మట్టిని తరలించే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో మట్టి తరలింపు జరుగుతుండగా సాయిలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాక్టర్ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు సాయిలుకు భార్య పోచమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు

# గుండ్ల చెరువు ఎఫ్‌టిఎల్‌లో వెంచర్

**డ్రైనేజ్ తో పాటు రోడ్డు కబ్జా..?**

**గుండ్ల చెరువు సంబంధించిన స్థలం కబ్జా**

**సమగ్ర విచారణ జరిపించాలని**

**స్థానికుల డిమాండ్**



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో గుండ్ల చెరువు కబ్జాకు గురైంది. ఈ చెరువు సమీపంలో స్థలాన్ని పలువురు కబ్జా చేశారు. అంతేకాకుండా అక్కడ ఉన్న రోడ్డుతో పాటు డ్రైనేజీని సైతం కబ్జా చేశారు. గుండ్ల చెరువు పక్కనే ఉన్న 252 సర్వే నెంబర్లు ప్రభుత్వ స్థలాన్ని అకౌంట్స్ జనరల్ ఆఫీస్ ఎంప్లాయిస్ కు కేటాయించారు. ఈ స్థలం పూర్తిగా ఎఫ్టీఎల్ లో ఉన్నట్లు తెలుస్తుంది. చెరువులను కబ్జాకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని అటు ప్రభుత్వం కానీ ఇటు అధికారు హెచ్చరిస్తున్నప్పటికీ చెరువులు మాత్రం యదోచ్ఛగా కబ్జాకు గురవుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పై విమర్శలు వెలుగుతున్నాయి.

### చెరువులోనే వెంచర్.?



### చెరువులోనే వెంచర్ వేసుకుని

ప్లాట్లు అమ్ముకుంటున్న అటు రెవెన్యూ అధికారులు కానీ ఇటు ఇరిగేషన్ అధికారులు కానీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. 252 సర్వే నెంబర్లు గండి చెరువు స్పష్టంగా కనిపిస్తుందని. ఇక్కడ 2010లో అకౌంట్స్ జనరల్ హౌసింగ్ సొసైటీ వరకి కేటాయించారు. ఈ స్థలం బాజప్ప గండి మైసమ్మ చెరువులోనే ఉంది. అంతేకాకుండా రోడ్ల కోసం వదిలేసిన స్థలంలో సైతం మట్టితో నింపేసి. గుండ్ల పోచంపల్లి నుండి గండి మైసమ్మ



చెరువుకు నుండి వచ్చే డ్రైనేజీ న పై మట్టి కప్పి కబ్జా చేసినట్లు. ఈ వెంచర్ గడి మైసమ్మ చెరువులో ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ దీనిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకాడుతున్నట్లు సమాచారం వినిపిస్తుంది. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.

### సమగ్ర విచారణ జరపాలి

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని 252 సర్వే నెంబర్లు జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. సముద్రంలోనే వెంచర్ ఉందన్న విషయం హైడ్రా అధికారులకు తెలువకపోవడం విచారకరం.

### కమీషనర్ సమగ్ర విచారణ జరిపించాలి

ఈ విషయంలో ఎల్లంపేట కమిషనర్ కృష్ణారెడ్డి సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. కబ్జాకు గురైన ఈ చెరువుపై ఉన్నత అధికారులతో సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# తక్కువ ధరకే బైక్‌నీ సొంతం చేసుకుంటే సంకెళ్లే

**- సెకండ్ హ్యాండ్ బైక్స్ కొంటున్నారా.? అయితే ఈ వార్త మీకోసమే**

**- మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో 42 బైకుల చోరీ కేసును ఛేదించి,20 లక్షల విలువైన వాహనాలు రికవరీ చేసిన పోలీసులు**

**- ఒకరు జైలులో ఉంటే, మరొకరు రోడ్లపై చక్కర్లు, మరు క్షణంలో బైక్ మాయం**

**- ద్విచక్ర వాహనాల దొంగల ఆటకట్టించిన బేగం పేట పోలీసులు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రోజు రోజుకీ మహానగరంలో జనాభా గణనీయంగా పెరుగుతున్న విషయం అందరికి తెలిసినదే.కానీ ఇదే అనువుగా కొందరు కేటుగాళ్లు చెతికి పని చెబుతున్నారు.రద్దీ ప్రాంతాలను టార్గెట్ చేస్తూ నచ్చిన ద్విచక్ర వాహనం క్షణాల్లో మాయం చేసేస్తున్నారు.బైక్ చోరీ కేసుల్లో ఆరితేరిన సంపంగి సమయాన్ని వేస్ట్ చేయకుండా వచ్చిన పని పూర్తి చేసుకుంటాడు.ఈ వ్యక్తి కోసం గత కొన్ని నెలలుగా వేట మొదలు పెట్టిన నేర విభాగానికి చెందిన పోలీస్ అధికారులు.ఈ నేపథ్యంలో సంపంగి రమేష్ గతంలో (24) నేర కేసుల్లో ప్రమేయం ఉన్న పాత నేరస్తుడు.జూలై 2024లో,వరంగల్ కమిషనరేట్‌లోని మేడికొండ పోలీస్ స్టేషన్లో అతన్ని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు, ఏడాది పైన ఉన్నప్పటికీ అతనిలో మార్పు రాలేదు. జైలు నుండి విడుదలైన తర్వాత,మళ్లీ బైక్ లను దొంగతనాలుప్రారంభించాడు.గత సంవత్సరం మల్కాజ్‌గిరి, వరంగల్,హైదరాబాద్, సైబరాబాద్,సిద్దిపేట, రామగుండం కమిషనరేట్ల పరిధిలో సుమారు (42) మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. మిగిలిన ఇద్దరు నిందితులు ఎ-2 సంపంగి మల్లేష్,ఎ-3 సప్పిడి రాజకుమార్‌లకు కూడా గతంలో నేర చరిత్ర ఉంది.



### వీళ్ల టార్గెట్ రద్దీ స్థలాలు..



ప్లేగ్రౌండ్‌లు, బస్ స్టాండ్‌లు, రైల్వే స్టేషన్ పార్కింగ్ ప్రాంతాలు,కూరగాయల మార్కెట్‌లు,రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకొని టూ వీలర్లను అన్‌లాక్ చేయడానికి డూప్లికేట్ తాళాలను ఉపయోగించి అక్కడి నుండి పరారయ్యేవారు.ఆ తర్వాత మోటార్ సైకిళ్లను గ్రామాల్లో ఉన్న రైతులు, కార్మికులు అవసరమైన వ్యక్తులకు 8,000 వేల నుండి 12,000 వరకు విక్రయిస్తూ తక్కువ ధరకే వస్తుందని అమాయకులు కొనుగోలుజేస్తారు.ఇలా దొంగ తనాలకు పాల్పడే వ్యక్తులు తమను తాము సెకండ్ హ్యాండ్ మోటార్ సైకిల్ డీలర్లుగా చెప్పుకుని దొంగిలించిన వాహనాలను ఈ విధంగా విక్రయిస్తున్నారు.

### "8"నెలల్లో "14"బైక్ లు మాయం..

గత ఎనిమిది నెలల్లో, బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పరేడ్ గ్రౌండ్స్ ప్రాంతం నుండి (14) మోటార్ సైకిళ్లు దొంగలించిన ఈ ముఠా.ఈ దొంగతనాలను సీరియస్‌గా తీసుకుని,ఎస్‌హెచ్‌ఓ పి. సైదులు,బేగంపేట్ డిఐ జి. శ్రీనివాస్ నేతృత్వంలో మల్కాజ్‌గిరి డిసిపి సిహెచ్. శ్రీధర్,బేగంపేట్ ఏసిపి పి. గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో బేగంపేట్ పోలీస్ క్రైమ్ టీమ్ నేరస్థులను గుర్తించడమే కాకుండా వారి నుంచి రికవరీ చేసిన "14"ద్విచక్ర వాహనాలు,ఎ-3 సప్పిడి రాజకుమార్‌ను అరెస్టు చేశారు.సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసే ముందు అసలు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ),యాజమాని వివరాలతో పాటు సంబంధిత పత్రాలను సరిచూసుకోవాలని నగర పౌరులకు పోలీసులు సూచించారు.సరైన పత్రాలు లేకుండా, అనుమానాస్పదంగా తక్కువ ధరకు వాహనాలను కొనుగోలు చేయడం వల్ల చట్టపరమైన చిక్కుల్లో పడే అవకాశం ఉంటుంది.అలాగే ముందు జాగ్రత్త భద్రతా చర్యగా నేటిజన్లు కనీసం ఏడాదికి ఒకసారైనా వారి మోటార్ సైకిల్ లాక్‌లను మార్చాలి.వీలైనంత వరకు సిసి కెమెరాలు ఉన్న చోట వాహనాలు పార్కింగ్ చేస్తే కనీసం పోయిన వస్తువు తిరిగి దొరికే అవకాశం ఉంటుంది.అలాగే మల్కాజిగిరి డిసిపి సిహెచ్ శ్రీధర్,బేగం పేట ఏసిపి గోపాల కృష్ణ మూర్తి ఈ కేసులో అత్యంత ప్రతిభ చూపించిన అధికారులను అభినందించడమే కాకుండా వారికి రివార్డులు అందజేశారు.ఈ సమావేశంలో బేగం పేట ఏసిపి గోపాల కృష్ణ మూర్తి, బేగం పేట ఇన్స్పెక్టర్ సైదులు,డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఓటములకు ఓటర్ల జాబితా కారణమా?

## - రాహుల్ గాంధీపై అమిత్ షా ఫైర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గుజరాత్‌లోని గాంధీనగర్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కారణమా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ఇటీవల వచ్చిందేనని, కానీ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వరుస పరాజయాలను చవిచూస్తోందని, తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంగళవారం 'ఇండియా' కూటమి నేతలు, విద్యార్థి సంఘాలతో సమావేశమైన అనంతరం రాహుల్ గాంధీ మీడియా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని, సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే తమ పోరాటమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
రాహుల్ మీడియా సమావేశం ముగిసిన వెంటనే స్పందించిన అమిత్ షా, గుజరాత్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. "గుజరాత్ ప్రజల మనోగతాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయి. యావత్ దేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుక కొండలా నిలబడి ఉందన్న విషయాన్ని ఈ విజయం చాటిచెప్పింది. గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 44 స్థానాలకు గాను బీజేపీ 38 చోట్ల ఘన విజయం సాధించింది. గత ఎన్నికలతో పోలిస్తే బీజేపీ ఓటు బ్యాంకు 10 శాతం పెరిగింది. రాహుల్ గాంధీకి నేను ఒక విషయం స్పష్టం చేయాలనుకుంటున్నాను. గాంధీనగర్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదు" అని ఆయన గుర్తుచేశారు. "రాహుల్ జీ, ఈ ఫలితాలకు కూడా ఓటర్ల జాబితా సవరణే కారణమని అంటారా? ప్రధాని మోదీకి, బీజేపీకి ఉన్న ప్రజాదరణను మీరు తోసిపుచ్చుతారా? మీరు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఒకప్పుడు అధికారంలో ఉన్న కీలక ప్రాంతంలో 41 ఏళ్లుగా గెలవలేకపోవడంపై ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇటీవల పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరిల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది" అని అమిత్ షా ఎత్తి చూపారు.ఢిల్లీలో వివిధ పార్టీల కార్యకర్తలను, జనాలను పోగేసినంత మాత్రాన దేశ ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేరని ఆయన హితవు పలికారు. "దేశ ప్రజల వాస్తవ గొంతుక పొలాల్లో, గ్రామాల్లో, మారుమూల కొండలు, అడవులు, నదీ తీరాల్లో ఉంది. మీకు అక్కడి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్లో ప్రజలు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను తిరస్కరిస్తూనే ఉన్నారు. ఇప్పటికైనా ప్రతికూల రాజకీయాలు మానుకుని ప్రజలతో మమేకం కావాలి" అని ఆయన సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలకు బీజేపీ-ఎన్డీయే కూటమి మరో భారీ ఓటమిని రుచి చూపిస్తుందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# ఆమ్రపాలి క్యాడర్ వివాదం

## - హైకోర్టులో తీర్పు రిజర్వ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ

## బుల్లెట్ ట్రైన్లు గురించి మాట్లాడుతున్నారు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రభుత్వం అనవసరంగా సేకరిస్తోందని, సీఎం రేవంత్ రెడ్డికి ఇంత భూదాహం ఎందుకో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పంటలు వేయవద్దని సలహా ఇస్తోందని కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588